ప్రజాశక్తి

సోపతి

నవంబర్ 02, 2014 ఆదివారం అనుబంధం

జయరాజ్‌తో ఇంటర్వ్యూ
ప్రాణమైన పాట

సృజనలోకం
బాలోత్సవ్

- భావన కథ 'వైకల్యం'
- ఆశారాజు కవిత : మోర్‌చెల్‌కట్ట
- మధుర స్వరాల్లో స్ఫూర్తి గీతాలు
- మౌనం ఆలాపన...

కుటుంబమే నా ప్రపంచం

ఒకప్పటి బాలీవుడ్ హీరోయిన్ జూహీచావ్లా నటిగానే కాక సినీ నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, టివి వ్యాఖ్యాతగా, ఒకప్పటి మిస్ ఇండియాగా సుపరిచితురాలు. అంతేకాదు సమయం దొరికినప్పుడల్లా స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తోంది కూడా. 1984లో మిస్ ఇండియా టైటిల్ గెలుచుకున్న తర్వాత నటనను వృత్తిగా చేపట్టింది జూహీ. తన మొదటి సినిమాతో అంతగా పేరు సంపాదించకపోయినా ఆ తర్వాత తీసిన ఖయామత్ సే ఖయామత్‌తో ఇక వెనక్కు తిరిగి చూసుకునే అవకాశమే రాలేదు. ఎన్నో భాషలలో నటించిన జూహీ రెండుసార్లు ఫిలింఫేర్ అవార్డులను గెలుచుకున్నారు. 80వ దశకం చివర్లో సినిమా ఇండస్ట్రీలో ప్రవేశించి 90లలో ఎన్నో విజయాలను అందుకున్నారు.

పెళ్ళయి, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ తన కుటుంబానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న జూహీ అప్పుడప్పుడు తన నటనను నిరూపించుకునే పాత్రలలో నటిస్తూనే టీవి సీరియళ్ళలో కూడా కనిపిస్తూ ప్రేక్షకులను కనువిందు చేస్తుంది. 'నా కుటుంబమే నా ప్రపంచం' అంటున్న జూహీ పిల్లల ఆలనా పాలనాలో మునిగి తేలుతుంది. కుటుంబమే మొదట... ఆతర్వాతే సినిమాలు, వృత్తి అంటున్న జూహీ చావ్లా తన కుటుంబ విశేషాల గురించి ఇచ్చిన ఇంటర్వ్యూ మీ కోసం...

సినిమాల్లోనే కాక ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తున్న మీరు అటు కుటుంబానికి, ఇటు వృత్తికి, స్వచ్ఛంద సంస్థలకు సమయాన్ని ఎలా విభజించుకుంటున్నారు? అసలు మీకు సమయం ఎలా సరిపోతుంది?

నా కుటుంబమే నా ప్రపంచం ఆ తర్వాతే పని ఇంకేమయినా. ఒక మహిళగా వృత్తికి, కుటుంబానికి ఉన్న సమయాన్ని బ్యాలెన్స్ చేసుకోవాల్సిందే. అలాగే చేసుకుంటాను. ఎందుకంటే నా పిల్లలతో కలిసి ఉండటం నాకు ఎంతో ముఖ్యం. వారి పనులు, వారికి సమయానికి కావలసినవి అందించడం నా విధి. పిల్లలు స్కూలు నుంచి వచ్చేటప్పటికే నా పనులన్నింటిని పూర్తి చేసుకుంటాను. నేను ఇంటికి వచ్చిన తర్వాత నా పూర్తి సమయం పిల్లలతోనే.

పిల్లలతో మీకున్న అనుబంధం ఎలాంటిది?

ప్రతి తల్లి తన పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ మురిసిపోతుంటుంది. మన కళ్ళ ముందే పిల్లలు పెద్దవాళ్ళవుతారు. వారు చేప్పే విషయాలను శ్రద్ధగా వినాలి. అప్పుడే మనం వారి గురించి ఆటెన్షన్‌లో ఉన్నామని తెలుసుకుంటారు. అందుకే వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వింటాను. సలహాలు ఇవ్వాలనుకుంటానే కాని ఆర్డర్ వేయను. అంతేకాదు, వారికి సలహాలు ఇచ్చేటప్పుడు ఒక గురువుగా, మార్గదర్శకురాలిగా మాత్రమే ఇస్తాను. నా అభిప్రాయాలు వారిపై రుద్దను.

పిల్లలతో మర్చిపోలేని క్షణాలు..

ఇటీవల వేసవికాలం సెలవులకు కుటుంబం అంతా కలిసి లండన్ వెళ్లాం. పిల్లలు స్కేటింగ్ నేర్చుకోవాలని అన్నారు. వారిని వాటర్ పార్క్‌కి తీసుకొని వెళ్లాను. ముందే ట్రైనర్‌ని కూడా మాట్లాడుకున్నాం. కాని వాతావరణం సహకరించక టీచర్ క్లాసులు రద్దు చేశారు. దాంతో పిల్లలు చాలా బాధపడ్డారు. వాతావరణం అనుకూలంగా అయిన తర్వాత పిల్లలు సైకిల్ రైడ్ చేద్దామన్నారు. సైకిల్స్ తీసుకొని రైడింగ్ చేశాం. ఐస్‌క్రీమ్‌లు తిన్నాం. నది అంచులలో ఆడుకున్నాం. పిల్లలు ఎంతో ఎంజాయ్ చేశారు. అలా పిల్లలతో ఆ రోజు గడిపిన క్షణాలు ఇంకా గుర్తుకున్నాయి. అవి మరిచిపోయేవా చెప్పండి.

మీ భవిష్యత్తు ప్రణాళికలు ఏమిటి? టీవి రియాలిటీ షోలలో జడ్జిగా మిమ్మల్ని ఊహించుకోవచ్చా?

ఇప్పటికిప్పుడు ఇలా చేయాలని ఏమీ అనుకోలేదు. మీరన్నట్లు ఒకవేళ జడ్జిగా అవకాశం వస్తే ఆలోచిస్తాను. ఎవరు వదులుకుంటారు చెప్పండి. ఇలాంటి అవకాశాల కోసం ఎంతో ఉత్సాహంతో ఎదురు చూస్తున్నాను కూడా.

– నక్షత్ర

■ అంతరంగం

సహనం

శతాబ్దాలు గడిచినా కొన్ని మాటల విలువ తరగక పోగా మరింతగా పెరుగుతుంది. భర్తృహరి నీతి శతకంలోని పద్యాలు అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. నీతిశతకమే కాదు, ఆయన చెప్పిన అనేకానేక పద్యాల్లోని ప్రతి మాటకీ ప్రాసంగికత వుంది. వాటిలో ఒక పద్యానికి సంబంధించిన సారాంశం ఇక్కడ గమనించండి: ఓర్పు ఉంటే కవచం అక్కరలేదు. క్రోధముంటే హాని కలిగించడానికి శత్రువుతో పనిలేదు. దాయాది ఉంటే వేరే నిప్పు అక్కరలేదు. స్నేహితుడుంటే ఔషధం అక్కరలేదు. దుష్టులుంటే భయంకరమైన సర్పాలు అక్కరలేదు. ఉదాత్తమైన కవిత్వం ఉంటే రాజ్యంతో పని లేదు. చక్కని విద్య ఉంటే సంపద అవసరం లేదు. తగురీతిని సిగ్గు ఉంటే వేరే అలంకారం అక్కరలేదు. ఈ ఓర్పు మొదలైన అంశాలు ఉన్న పక్షంలో కవచం మొదలైన వాటితో ప్రయోజనం లేదు.

దీనిలో ఏ వాక్యాన్ని కూడా త్రోసిరాజనలేం. శతాబ్దాల కిందట మానవ స్వభావాన్ని, లోకరీతిని గమనించి భర్తృహరి చెప్పిన మాటల్లోని విశిష్టత ఇప్పటికీ వర్తించడం విశేషం. మరీ ముఖ్యంగా సహనం గురించి వారు చెప్పిన మాటలు శిరోధార్యం. సహనం గల మనుషులు భావోద్వేగాలకు లోను కాకుండా నింపాదిగా వ్యవహరిస్తారు. తొందరపాటు ప్రదర్శించరు. దూకుడుతనం ఉండదు. మాటల్లో, చేతల్లో క్రమశిక్షణ పాటిస్తారు. ఇది చాలా సహజంగా వారి వ్యవహారసరళిలో ఒదిగిపోయి వుంటుంది. ఆవేశకావేషాలకు లోను కాకుండా ఔచితీమంతంగా వ్యవహరించడం వారి సుగుణం.

కొన్నిసార్లు దర్పం ప్రదర్శించేవారు, డాంబికాలు పలికేవారు ఆచరణలో తేలిపోతారు. మాటల్లోని తీవ్రత ఆచరణలో కనిపించదు. అందుకని సహనంగా వ్యవహరించడంలోని మేలిమి గురించి భర్తృహరి వక్కాణించారు. సహనం అంటే నత్తనడక కాదు. ఓర్పుతో ఉండేవారు అవసరమైనప్పుడు వేగంగా వెనువెంటనే స్పందిస్తారు. అయితే వివేకం ప్రదర్శిస్తారు. వివేచనతో మాట్లాడుతారు.

నొప్పించకుండా వ్యవహరించడం సహనంలోని మరో లక్షణం. ఈ లక్షణం గలవారు త్వరపడి మాటలు విసరరు. తెలియక చేసే పొరపాట్లను తీవ్రంగా తీసుకోరు. క్షమాగుణం, దయాగుణం వారి ప్రవర్తనకు శోభనిస్తాయి. సహనం సంస్కారాన్ని అలవరుస్తుంది. అయితే కొన్నిసార్లు అది చేతకానితనంగా పరిగణించే ప్రమాదముంది. అందుకని సహనంగా వున్నా కచ్చితంగా, నిర్దిష్టంగా వ్యవహరించడం మంచిది. ముఖం మీదనే చెప్పాల్సిన మాట చెప్పితీరాలి. మొహమాటపడకుండా చెప్పాలి. తడుములాట అక్కర్లేదు. ఇలాంటి సందర్భాల్ని దృష్టిలో పెట్టుకొని సహనానికి కూడా హద్దుంటుందని పెద్దలు అన్నారు. ఓర్పుతో వ్యవహరిస్తే మిత్రలాభం మెండు అని కూడా చెప్పారు. మానవ జీవితాన్ని ఉద్దీపింపజేసే శాశ్వతమైన విలువలివి. వీటిని జీవితాచరణలో భాగం చేసుకున్నవారి బతుకు ఒక నిశ్చింత.

వెంటాడే వాక్యం నీ గతానికి బందీ కాకు. నీ భవిష్యత్తుకు నిర్మాతగా ఉండు. నీలో పూర్తి మార్పు వస్తుంది.

ప్రజాశక్తి
సోపతి
నవంబర్ 2, 2014

లేఖలు	4
సంగీతం	
మధుర స్వరాల్లో స్ఫూర్తి గీతాలు	5
కవర్‌స్టోరీ	
సృజనలోకం బాలోత్సవ్	6
మౌనం ఆలాపనా...	9
ఇంటర్వ్యూ ప్రాణమైన పాట	10
నవరాగం చూపులన్నీ ముళ్లు కావు!	13
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
కథ భావన	18
స్ఫూర్తినిచ్చిన గురువు	
లఘువును గురువుగా చేసిన గురువు	20
సృజన నాజీలను ఎదిరించిన సీగ్రిడ్ ఇండ్సెట్	21
సోర్స్‌కోడ్ డ్రోన్‌ల ద్వారా ఇంటర్నెట్	23
సమీక్షలు	
సిక్స్త్ ఎలిమెంట్‌పై ఒక చూపు	24
నచ్చిన పుస్తకం గాంధీ ఆత్మకథ సత్యశోధన	25
ఈ వారం కవిత్వం	
మోర్ చెల్‌కట్ట	26

చిన్నారు సృజనలోకాన్ని ఆవిష్కరించే బాలోత్సవ్‌కు ఖమ్మం జిల్లా కొత్తగూడెం పట్టణం సిద్ధమవుతోంది. ఆ ఉత్సవ తరంగాల సమాహారమే ఈవారం ముఖచిత్రకథనం.

లేఖలు



వివరణ బాగుంది

కవర్ స్టోరీ 'వినూత్న సృజనకు నోబెల్ ' వ్యాసం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి. ఉపన్యాసం, విందు, బహుమతి ప్రదానం, పంచే నగదు అన్నీ వివరాలు బాగున్నాయి. కత్తికి రెండు వైపులా పదును ఉన్నట్లు తను కనిపెట్టిన డైనమైట్ మనుషుల ప్రాణాలు, అందులో తన కుటుంబ సభ్యుల ప్రాణాలు పోయినప్పుడు గానీ ఆల్ఫ్రెడ్ నోబెల్ తెలిసిరాలేదు. తనెంత పొరపాటు చేశాడో. అయితే వెంటనే చేసిన తప్పును దిద్దుకోడానికి ఆయన పెట్టిన నోబెల్ ప్రైజ్ నేడు ఎందరో ప్రముఖులను గుర్తింపు ఇస్తోంది. నోబెల్ చరిత్రతో పాటు ఈ సంవత్సరం నోబెల్ బహుమతి పొందిన వారందరి గురించి ఇవ్వడం బాగుంది. 114 సంవత్సరాల నుండి ఈ బహుమతులు ఇస్తున్నా మన దేశానికి చెందిన వారు కేవలం ఏడుగురే ఎంపిక కావడం విచారకరం.

- డి. శిరీష, హైదరాబాద్

పులుసు అద్భుతం

'పులుసు రాయి' కథ బాగా నవ్వు తెప్పించింది. ప్రత్యేకత ఏమీ లేని ఒక గులకరాయిని తీసుకుని మాటలతో మాయచేసి మంచి పులుసు తయారు చేయించిన సిపాయి చాతుర్యం మెచ్చుకుని తీరాల్సిందే. అన్ని రకాల కూరగాయల ముక్కలు వేసిన తర్వాత ఏ పులుసైనా అద్భుతంగానే ఉంటుంది. కానీ ఆ గ్రామ ప్రజలను భలేగా మభ్యపెట్టి పులుసు తయారు చేయడంలోనే అతని తెలివితేటలున్నాయి.

- ఎస్.కార్తీక్, నల్గొండ

సమస్యల్లో రకాలు, పరిష్కారాలు

'సమస్యలను ఎదుర్కోవాలా? తప్పుకోవాలా?' శీర్షికలో సమస్యల రకాలను, వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. సమస్యలను పరిష్కరించుకోవడంలో అశ్రద్ధ, అలక్ష్యం చేయకుండా, వాటి నుండి పూర్తిగా వైదొలగడమే ఉత్తమం అని చెప్పడం బాగుంది.

- ఎస్.కె. షరోన్, కన్మన్‌కాల్వ, మహబూబ్‌నగర్

నిద్రలోనే పూర్తి విశ్రాంతి

'ఆయుష్షును పెంచేది ఖచ్చితంగా నిద్రే. రోజువారీ జీవితంలో అలసిపోయినప్పుడు తగినంత విశ్రాంతి తీసుకోకుండా పని చేసుకుంటూ పోతే నిసత్తువ ఆవరించి మనిషి బలహీనమైపోతాడు. పునరుత్తేజం పొందాలంటే శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా విశ్రాంతి అవసరం. అది ఒక్క నిద్రతోనే సాధ్యం. తగినంత విశ్రాంతి తీసుకుంటూ పని చేస్తే ఆయుష్షు కూడా పెరుగుతుందనడంలో సందేహం లేదు.

- పి. సత్యనారాయణమూర్తి, ఆదిలాబాద్

అర్థం చేసుకుంటే సాధ్యమే!

'నవరాగం' వ్యాసాలు బాగుంటున్నాయి. సున్నితమైన ప్రేమ భావంతో వస్తున్న ఈ వ్యాసాల కోసం ఎదురు చూస్తున్నామంటేనే ఆశ్చర్యంగా ఉంది. ఎదుటి మనిషిని యథాతథంగా స్వీకరించగలిగినప్పుడు ఏ ఇద్దరి మధ్యా సమస్యలనేవి ఉండవు. ఇది పూర్తిగా అర్థం చేసుకున్న ఇద్దరు వ్యక్తుల మధ్య మాత్రమే సాధ్యమవుతుందేమో! అసలు అలా అర్థం చేసుకునే పరిస్థితి నేటి పరిస్థితుల్లో సాధ్యమేనా అనిపిస్తుంది.

-ఎం. చైతన్య, మిర్యాలగూడ

టెక్నాలజీ సమాచారం

'సోర్స్‌కోడ్'లో ప్రస్తుతం వస్తున్న టెక్నాలజీకి సంబంధించిన సమాచారం ఉపయోగంగా ఉంటోంది. 3జి, 4జి, 5జి అంటే ఏమిటో, అవి ఎలా పనిచేస్తాయనే వివరణ బాగుంది. 5జి టెక్నాలజీ వచ్చినా కూడా మనకు ఇంకా 3జి కూడా పూర్తి వినియోగంలో లేదు.

- వి. రఘునాథ్, వంగపల్లి, నల్గొండ

మన జాతీయాలు

గలమ తీసినట్లు

గలమ అంటే గవిని, ద్వారం. పొలంలో ఒక మడి నుండి మరొక మడికి నీరు పోవటానికి గలమలు చేస్తారు. అవసరం లేనప్పుడు గలమలను మట్టితో అడ్డు పెట్టి మూసివేస్తారు. మళ్ళీ నీళ్ళు ఎక్కువగా నిలిచినప్పుడు వేసిన మట్టిని తొలగించటమే గలమ తీయటం. గలమ తీసినప్పుడు భళ్ళున మడిలోని నీరు ఒడ్డుకు వున్న గలమ ద్వారా మరో మడిలోనికి 'బలబలా' చప్పుడుతో వేగంగా పోతాయి. ఒక చోట సమావేశం జరుగుతుంది. మధ్యాహ్నం అయ్యింది. సభికులు ఆకలితో వుంటారు. కార్యక్రమం ఎప్పుడు ముగుస్తుందోనన్న ఆతురత చోటు చేసుకుంటుంది. అలాంటి సందర్భాల్లో అంటే ఎదురు చూస్తుండగా సభ ముగిసినప్పుడు సభికులు ఒకేసారి లేచి బయటికి పోయే ప్రయత్నంలో మీద మీద పడిపోతుంటారు. "తొందరేం లేదు ఒక నిమిషం వెనుకా ముందు గలమ తీసినట్లు మీద మీద పడిపోవటమెందుకు తిన్నగా పోరాద" అని సభా నిర్వాహకుడు మందలించటంలో ఈ జాతీయం ప్రయోగం కనిపిస్తుంది.

దొరికినంత బరుకుట

బరుకుట నిఘంటవుల్లో లేదు. పచ్చిగడ్డిని, పచ్చిమేతను తొందరగా కోయుటకు బరుకుటగా వాడుకలో వుంది. పరుల సొమ్ము ఎంత లభిస్తే అంత తొందరగా దక్కించుకోవాలనే తాపత్రయం కొందరు కలిగివుంటారు. పరాయి చేనులో పచ్చని గడ్డి వుంది. తొందరగా కోసుకొని పోచూస్తారు. "సర్కారు వారు అప్పులు ఇస్తున్నారని తెలిసి వున్నోడు లేనోడు అందరు దొరికినంత బరకాలని దరఖాస్తులు పెట్టిండ్రు" అనటంలో ఈ జాతీయం వాడకం వుంది.

బీరపూల యాళ్ల

బీరపూలు సాయంకాలం సంజెవేళలో పూస్తాయి. గడియారాలు లేనప్పుడు మానవుని దినచర్యంతా ప్రకృతితో ముడిపడి వుండేది. అంబటాళ్ల, ఆకటాళ్ల, పనుల యాళ్ల, బీరపూలయాళ్ల, కుందేలు మసక, చుక్క పొడంగ అన్నీ ఇలాంటివే. "బీరపూల యాళ్లయింది. బతుకమ్మను తీసుకపొండ్రి. మళ్ళీ చీకటైతది రాంగ" అనటంలో ఈ జాతీయం ప్రస్తావన చూడొచ్చు.

- వేముల పెరుమాళ్ళు

■ సంగీతం

జీవితమంటేనే కష్టసుఖాలు, వెలుగునీడలు, సంతోషం, దుఃఖాల కలబోత. కష్టాలకి, కన్నీళ్లకి, వెరిసి వెనుదిరిగితే జీవితంలో ముందుకు వెళ్లలేరు. వీటన్నిటిని అధిగమించి విజయాలు సాధించాలంటే స్ఫూర్తి కావాలి. అది స్కూల్లో విద్యార్థులకు టీచర్ చెప్పే పాఠాలు కావచ్చు, ఇంట్లో పెద్దవాళ్లు కావచ్చు, స్నేహితులు, హితులు ఎవరైనా కావచ్చు. ఆ మాటలను వింటుంటే నిస్తేజం పోయి ఉత్సాహం ఉరకలు వేస్తుంది. రాయినైనా పిండిచేయగల ఆత్మవిశ్వాసం వస్తుంది. దీనిని ప్రోది చేయగల పాటలు చిత్రసీమలో చాలానే ఉన్నాయి. వాటిలో కొన్ని...

తోడి కోడళ్లు చిత్రంలో ఇద్దరూ కలిసి ఆడుతూ పాడుతూ పని చేస్తే ఎంతటి పనినైనా సునాయాసంగా చేయొచ్చంటారు కొసరాజు. "ఆడుతు పాడుతు పని చేస్తుంటే అలుపూ సొలుపే ఉండదు... ఇద్దరమొకటై చేయి కలిపితే ఎదురేమున్నది" అంటూ ఘంటసాల, పి.సుశీల పాడిన ఈ పాటకు మాస్టర్ వేణు సంగీతం అందించారు.

మధుర స్వరాల్లో స్ఫూర్తి గీతాలు

'శభాష్ రాముడు' చిత్రంలో జయమ్ము నిశ్చయమ్మురా భయమ్ము లేదురా... జంకు బొంకు లేక సాగిపొమ్మురా... సాగిపొమ్మురా..." అంటూ సాగే ఈ పాటలో కష్టాలకోర్చుకుంటేనే సుఖాలు దగ్గుతాయి అంటారు శ్రీశ్రీ. ఘంటసాల, స్వర్ణలత పాడిన ఈ పాట ఈ చిత్రంలో రెండుసార్లు ఉంటుంది.

భారతదేశంలో 70 శాతానికి పైగా వ్యవసాయం మీద బతికేవాళ్లే. పొలాలమ్ముకుని పట్నానికి వలసపోయి బ్యాంకుల్లో డబ్బు దాచుకునేవారికి తిండి ఎక్కడినుండి వస్తుంది? ఈ విషయం 60 ఏళ్ల క్రితమే గమనించినట్లున్నారు రచయిత అందుకే రోజులు మారాయి చిత్రంలో "ఏరువాకా సాగాలో రన్నో చిన్నన్న... నీకష్టమంతా తీరాలో రన్నో చిన్నన్న..." అంటూ వ్యవసాయం ఎంత ముఖ్యమో ఈ పాటలో చెప్పారు. మాస్టర్ వేణు సంగీతంలో జిక్కీ పాడిన ఈ పాట ఇప్పటికీ ఆదరణ పొందుతోంది.

"వుందిలే మంచి కాలం ముందుముందునా.. అందరూ సుఖపడాలి నందనందనా..."రాముడు భీముడు చిత్రంలోని ఈ పాట పేదాగొప్పా తేడాలు తొలగి అందరూ సమానమనే కాలం ముందు ముందు రాబోతున్నదని, అందుకు ఏం చేయాలో కూడా శ్రీశ్రీ ఎంతో గొప్పగా ఊహించి రాశారు. కానీ ప్రస్తుతం ఆ తేడాలు ఇంకా పెరిగిపోయాయే తప్ప తరగలేదు. ఈ పాటను ఎస్.రాజేశ్వరరావు సంగీత దర్శకత్వంలో ఘంటసాల, సుశీల పాడారు.

అందరూ మరొకరి బాటలో నడవాలంటే అడుగు ముందుకు పడదు. కానీ ఒకరు మొదలు పెట్టారంటే వారి అడుగుజాడల్లో మరికొందరు ముందుకు సాగుతారు. ఇదే అర్థంతో వచ్చే పాట రేవతి, శరత్‌బాబు నటించిన 'అంకురం' చిత్రంలోని "ఎవరో ఒకరు ఎపుడో అపుడు నడవరా ముందుగా అటో ఇటో ఎటో వైపు... మొదటి వాడు ఎప్పుడూ ఒక్కడే మరీ... మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే మరీ..." సిరివెన్నెల రాసిన ఈపాటను చిత్ర, బాలు పాడారు.

ఏదైనా సాధించాలంటే పౌరుషంతో పోరాటం చేస్తే జీవితంలో విజయం సాధించడం అసాధ్యం కాదనే అర్థంతో సాగే పాట "సాహసం నా పథం రాజసం నా రథం... సాగితే ఆపడం సాధ్యమా..." మహర్షి చిత్రంలోని ఆత్రేయ రాసిన ఈ పాటను ఇళయరాజా సంగీత దర్శకత్వంలో ఎస్.పి.బాలసుబ్రమణ్యం ఆలపించారు.

"ఎవరేమీ అనుకున్నా నువ్వుండే రాజ్యానికి రాజు నువ్వే బంటు నువ్వే మంత్రి నువ్వే సైన్యం నువ్వే" పాట 'బడ్జెట్ పద్మనాభం' చిత్రంలోనిది. ఎస్.వి.కృష్ణారెడ్డి సంగీతంలో ఎస్.పి.బాలు పాడిన ఈ పాటలో ఎన్ని అవాంతరాలెదురైనా అనుకున్నది సాధించాలంటే రాజు, బంటు, మంత్రి అన్నీ నువ్వే అనుకుని పని మొదలుపెడితే విజయం సాధించడం మామూలు విషయం అంటారు చంద్రబోస్.

కష్టాలు, కన్నీళ్లకు వెరవకుండా, రాజీ పడకుండా ప్రయత్నిస్తే గెలవడం కష్టం కాదు అని చెప్పే భద్రాచలంలోని పాట "ఒకటే జననం ఒకటే మరణం ఒకటే గమనం, ఒకటే గమ్యం గెలుపు పొందే వరకూ అలుపు లేదు మనకు బ్రతుకు అంటె గెలుపు, గెలుపు కొరకె బ్రతుకు". సుద్దాల అశోక్ తేజ రాసిన ఈ పాటను వందేమాతరం శ్రీనివాస్ సంగీత దర్శకత్వంలో శంకర్ మహదేవన్, చిత్ర ఆలపించారు.

"ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి... ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి... విశ్రమించవద్దు ఈ క్షణం, విశ్మరించవద్దు నిర్ణయం, అప్పుడే నీ జయం నిశ్చయం" పాట సుమన్ నటించిన పట్టుదల చిత్రంలోనిది. సిరివెన్నెల కలం నుండి జాలువారిన ఈ పాటను ఇళయరాజా స్వరకల్పనలో జేసుదాసు ఆలపించారు.

అథ్లెటిక్ అశ్విని నాచప్ప, భానుచందర్ నటించిన 'అశ్విని' చిత్రంలో "చెయ్ జగము మరచి జీవితమే సాధనా.. నీ మదిని తరచి చూడడమె శోధనా... ఆశయమన్నది నీ వరం, తలవంచును అంబరం" అంటూ అశ్వినిని పరుగు పోటీకి ఉత్సాహపరుస్తాడు ఈ పాటతో భానుచందర్. ఎం.ఎం. కీరవాణి సంగీత దర్శకతంలో బాలు, చిత్ర పాడారు.

"మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది, ఎదిగిన కొద్దీ ఒదగమని అర్థమందులో ఉంది, అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది" అనే పాటలో తలచుకుంటే సాధ్యంకానిదేదీ లేదు. తల రాత అనుకోకుండా సంకల్ప బలంతో అపజయాల్ని కూడా గెలుపు బాటలో పెట్టొచ్చు అంటారు చంద్రబోస్ 'నా ఆటోగ్రాఫ్' చిత్రంలో. చిత్ర పాడిన ఈ పాటకు ఎం.ఎం. కీరవాణి సంగీతం సమకూర్చారు.

నవ నాగరిక ప్రపంచంలో బతుకుతున్నా, ఇంకా పాత రాతి యుగం నాటి అడవి నీతినే పాటిస్తున్న సమాజాన్ని "నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని, అగ్గితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని... మారదు లోకం మారదు కాలం" అంటూ సిరివెన్నెల భావావేశంగా పాడతాడు సిరివెన్నెల సీతారామశాస్త్రి గాయం చిత్రంలో. ఎస్పీ.బాలు స్వరం నుండి వెలువడిన ఈ పాట రచయిత సిరివెన్నెల. సంగీతం శ్రీ కొమ్మినేని.

'ఆ నలుగురు' చిత్రంలో "ఒక్కడై రావడం ఒక్కడై పోవడం నడుమ ఈ నాటకం విధి లీలా", వేదం చిత్రంలో "పద పద పద పద... నిను నువు తరుముతు పద... ఇప్పుడు కాకుంటే ఎప్పుడు కానట్టే... ఇక్కడనే ఉంటే ఉన్నా లేనట్టే....", సంబరం చిత్రంలో "పట్టుదలతో చేస్తే సమరం తప్పకుండా నీదే విజయం కష్టపడితే రాదా ఫలితం పదరా సోదరా"... ఇలా ఎన్నో స్ఫూర్తినిచ్చే మంచి మంచి పాటలు సినిమాల్లో ఉన్నాయి. కాలక్షేపానికి చూసే సినిమాల్లో కూడా ఇంత మంచి పాటలు ఉన్నాయి. మరి వీటిని చూసి, స్ఫూర్తి పొంది, తమ జీవితంలో కొద్దో గొప్పో విజయం సాధించిన ప్రేక్షకులు ఎంత మంది ఉన్నారో!

- బి.మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ

సృజనలోకం

బాలోత్సవ్

పిల్లల అల్లరి వేషాలు.. చిలిపి చేష్టలు చూసి ఏ తల్లిదండ్రులు మాత్రం మురిసిపోరు. అలాంటి పిల్లలను మనం అపురూపంగా చూసుకుంటాం.. ప్రతి విషయంలోనూ వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ప్రతి తల్లిదండ్రులు శక్తిమేర కృషి చేస్తుంటారు. కానీ ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే. అసలు పిల్లలకు ఓ ప్రత్యేక ప్రపంచం ఉందనీ, దానిని వారికి దూరం చేస్తున్నామని ఈ రోజుల్లో ఏ తల్లిదండ్రులూ గుర్తించడం లేదు. 'ఉరుము ఉరిమితే మెరుపు మెరిస్తే ఆకసాన హరివిల్లు విరిస్తే అవి మాకే అనుకునే పిల్లల్లారా పిట్లల్లారా.. ఐదారేళ్ల పాపల్లారా' అని మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు పిల్లలు నేడు అలాంటి సంతోషకరమైన దినాలు గడుపుతున్నారా? ఓ ప్రత్యేక ప్రపంచం ఉందన్న విషయం వారికి తెలుసా? తెలియజేస్తున్నామా? నేటి బాల్యం బళ్లో బందీ అవుతోంది. పుస్తకాలతో దోస్తీ కడుతూ, ర్యాంకుల కోసం కుస్తీ పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బాల్యం ఇదీ అని, దానికి ఓ అర్థాన్ని చెప్పి, వారికంటూ ఓ కొత్త లోకం ఉందనీ, వారిని ఆలోచింపజేసి వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే వేదిక ఒకటుందని వారికి గుర్తింప జేసింది 'బాలోత్సవ్' 1991 నుండి ఖమ్మం జిల్లా కొత్తగూడెం క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు చొరవతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.



1991లో కేవలం నాలుగు అంశాలతో ప్రస్థానం ప్రారంభించిన బాలోత్సవ్ సంస్కృతి నేడు రాష్ట్రం నలుచెరుగులా వ్యాపించింది. ఈ సారి 23వ జాతీయస్థాయి అంతర్ పాఠశాలల సాంస్కృతిక ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. స్థానిక కొత్తగూడెం క్లబ్, ది కె.సి.పి సిమెంట్, హైదరాబాద్‌కు చెందిన నోవా అగ్రిటెక్ వారి సౌజన్యంతో నవంబర్ 7,8,9 తేదీల్లో ఈ ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. అందుకోసం కొత్తగూడెం క్లబ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చిన్నారులను అబ్బురపరిచే విధంగా చిత్రాలను ఏర్పాటుచేశారు. కొత్తగూడెం అంటే బొగ్గుగనులకు ప్రసిద్ధి అనే రోజులు పోయాయి. సింగరేణి బొగ్గుపెళ్లల నుండి వచ్చే మట్టి పరిమళాలను, మాతృభాషా మాధుర్యాన్ని ఆస్వాదించాలనుందా.. అయితే మీ చిన్నారులతో బాలోత్సవ్‌ను ఒక్క సారన్నా దర్శించాల్సిందే...

బాలోత్సవ్ అంకురార్పణ ఇలా..!

బాలోత్సవ్ ఆవిర్భావం వెనుక ఓ ఆసక్తికరమైన విషయం ఉంది. కొత్తగూడెం, పాల్వంచ పారిశ్రామిక ప్రాంతాలు కావడంతో నిత్యం ఎంతోమంది అధికారులు, అనధికారులు వచ్చివెళ్లేవారు. వారితో సహా పట్టణంలోని ప్రముఖుల ఆటవిడుపు కోసం 1960లో రిక్రియేషన్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. క్లబ్ అంటే సాధారణంగా ప్లేకార్డ్స్, చెస్, షటిల్, క్యారమ్స్ వంటి ఆటలతోనే కాలం వెళ్లదీసేవారు. పిల్లలు కానీ, ఇతర సాధారణ ప్రజలు కానీ ఆవైపు కన్నెత్తి చూసే వారు కాదు. క్లబ్ అంటే ఆనాడు అలాంటి వాతావరణం ఉండేది. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో 1991లో క్లబ్ కార్యదర్శి పదవికి ఎన్నికలు జరిగాయి. కార్యదర్శిగా ఎన్నికైన వారు ఎలాంటి కార్యక్రమాలు చేపడతారో సభ్యులకు వివరించాల్సి ఉంటుంది. అప్పుడు పోటీలో ఉన్న డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు తన అభిప్రాయాన్ని చెబుతూ క్లబ్ అంటే ప్రజల్లో ఉన్న దురభిప్రాయాన్ని పోగొట్టడమే తన ధ్యేయమనీ, సామాన్యులను కూడా ఆకర్షించగలిగే కార్యక్రమాలను చేపడతానని సగర్వంగా అన్నారు. అలా ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టు కొనేందుకే బాలోత్సవ్‌కు అంకురార్పణ చేశారు.

ప్రారంభంలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం వంటి అంశాలలో పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ పోటీలకు లభించిన అనూహ్య స్పందనతో 1995 నుండి జిల్లా స్థాయిలో బాలబాలికలకు 8 అంశాలలో సాంస్కృతిక విలువ రెట్టింపు చేసే కార్యక్రమాలు వరుసగా ఐదు సంవత్సరాలు నిర్వహించారు. 2000వ సంవత్సరం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల సాంస్కృతిక ఉత్సవాలకు శ్రీకారం చుట్టి "బాలోత్సవ్"గా ప్రకటించి కార్యక్రమాలను మూడు రోజులకు విస్తరింపజేశారు. ఆ యేడాది 6 జిల్లాల నుండి మూడు వేల మంది బాలబాలికలు హాజరై తమ బహుముఖ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. ఆనాటి సాంస్కృతిక ఉత్సవాలకు అనూహ్య స్పందన, అధికార, అనధికారుల ప్రశంసలు లభించాయి. 2001వ సంవత్సరంలో 9 జిల్లాల నుండి 4వేల మంది చిన్నారులు, 2002లో 12 జిల్లాల నుండి 5,400 మంది బాలబాలికలు, 2003లో 14 జిల్లాల నుండి 7వేల మంది బాలబాలికలు, 2004లో 16 జిల్లాల నుండి 8వేల మంది, 2005లో 8,200 మంది, 2006లో 8,500 మంది ఇలా యేడాదికేడాది సంఖ్య పెరిగిపోయి చివరి సారిగా నిర్వహించిన ఉత్సవాల నాటికి 20 జిల్లాల నుండి 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల సంఖ్య బాగా పెరిగింది. 4 అంశాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నేడు 20 అంశాలతో 30 కేటగిరీలుగా విస్తరించింది. ఈ సారి జాతీయస్థాయి వేడుక కావడంతో 8 రాష్ట్రాల నుండి విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇప్పటికే ఎంట్రీలు

వస్తున్నాయి. పట్టణంలో గత 23 సంవత్సరాలుగా జరుగుతున్న ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే వారికి గూడెం ప్రజలు ఆతిథ్యాన్ని ఇచ్చి కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్ర, ఢిల్లీ, పాండిచ్చేరి, యానాం, కర్ణాటక రాష్ట్రం నుండి ఇప్పటికే చిన్నారుల ఎంట్రీలు అందాయి. ఇతర ప్రాంతాల వారికి ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు బహుమతులు కూడా విలువైనవి అందజేస్తున్నారు. అంకితభావం, నిరంతర శ్రమ, స్వచ్ఛంద సేవానిరతి గల మేధావులు, వాణిజ్యవేత్తలు, అధ్యాపకులు, వైదులు, న్యాయవాదులు, కళాభిమానులు, శ్రేయోభిలాషులతో పటిష్ట ఉత్సవ కార్యవర్గ సభ్యుల తోడ్పాటు బాలోత్సవ్ విజయాలకు ప్రధాన కారణం.

వికలాంగుల కోసం...!

బాలోత్సవ్‌లో విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంతో తమ పని అయిపోయిందను కోలేదు నిర్వాహకులు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎంతో మంది వికలాంగులైన విద్యార్థులను చూసిన నిర్వాహకులు చలించిపోయారు. వీరి కోసం కూడా ఏమైనా చేయాలనే ఆలోచనకు పదునుపెట్టారు. ఆ క్రమంలోనే వికలాంగుల కోసం ఓ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2003 నుండి వికలాంగుల కోసం జనవరి 26న కొత్తగూడెం కబ్ల్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మానసిక, శారీరక అంగవైకల్యం గల వికలాంగులు ఈ కార్యక్రమంలో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. వీరికి 8 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. వికలాంగులైన విద్యార్థులు బడిని, ఇంటిని, తల్లిదండ్రులను మరిచిపోయి ఓ కొత్తలోకంలో విహరిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.

తప్పులను సరిదిద్దడం ప్రత్యేకత

కార్యక్రమం నిర్వహించడం. బహుమతులు ఇచ్చి వదిలేయడంతో తమ పని అయిపోయిందని చేతులు దులుపుకోలేదు నిర్వహకులు. ఈ కార్యక్రమాలకు బెంగుళూరు, చెన్నై, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి ఆయా రంగాల్లో నిష్ణాతుల న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. వారు ఎంతో ఓర్పుతో పిల్లల ప్రతిభను గుర్తించి వారి తప్పులను కూడా నోట్ చేసుకుంటారు. ఏ విషయాల్లో తప్పులు చేస్తున్నారో ఆ తప్పులను వారికి వివరించడం, వాటిని కరెక్షన్ చేసి చెప్పడం ద్వారా పిల్లలను సుశిక్షితులుగా తయారు చేస్తున్నారు. మొదటిసారి ఈ కార్యక్రమాన్ని చూడడానికి వచ్చిన ఎంతో మంది విద్యార్థులు మరుసటి యేడాదికి ఏదో ఒక అంశాన్ని నేర్చుకొని కార్యక్రమంలో పాల్గొనేందుకు

పోటీలోని సాంస్కృతికాంశాలు

1. చిత్రలేఖనం (స్పాట్ డ్రాయింగ్), 2. తెలుగు మాట్లాడుదాం
3. లఘు చిత్ర సమీక్ష (షార్ట్ ఫిలిం రివ్యూ), 4. కవితా రచన
5. చిత్ర విశ్లేషణ (పిక్చర్ ఎనాలసిస్), 6. కథా విశ్లేషణ
7. క్విజ్, 8. కథారచన, 9. అనగా అనగా..(కథ చెబుతా వింటారా!)
10. భరతనాట్యం, 11. కూచిపూడి, 12. జానపద నృత్యాలు
13. విచిత్ర వేషధారణ (ఫ్యాన్సీ డ్రస్), 14. లేఖా రచన
15. సినీ, లలిత, జానపద గీతాలు, 16. వక్తృత్వం (తెలుగు/ఇంగ్లీషు)
17. వ్యర్థంతో అర్థం, 18. వాయిద్య సంగీతం (ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్)
19. గ్రూప్ డాన్స్, 20. నాటికలు

నాలుగు అంశాలతో ప్రారంభమైన బాలోత్సవ్ నేడు 20 అంశాలను నిర్వహించే స్థాయికి చేరిందంటే పిల్లల నుండి, వారి తల్లిదండ్రుల నుండి వస్తున్న ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. అందుకే బాలోత్సవ్ పిల్లల అభిరుచులకు అద్దంపడుతోంది. 20అంశాలు, 36 విభాగాలుగా వర్గీకరించారు. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు ప్రోత్సాహక బహుమతులు కూడా ఇస్తున్నారు. సాంస్కృతిక ఉత్సవ పోటీలలో పాల్గొన్న ప్రతి పాఠశాలకు సర్టిఫికెట్ ఇస్తారు. క్విజ్, గ్రూప్‌డాన్స్, నాటికలు, వ్యర్థంతో అర్థం అంశాలు మాత్రమే గ్రూపు ఈవెంట్స్‌గా పరిగణిస్తారు. మిగిలినవన్నీ వ్యక్తిగత ప్రదర్శనలుగానే గుర్తింపు పొందుతాయి.

వస్తున్నారంటే బాలోత్సవ్ ఎంతగా స్ఫూర్తినిస్తుందో తెలుస్తోంది. చూచిరాత, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ తీసుకున్న అనేక మంది పిల్లలు తాము బాలోత్సవ్‌ను చూసిన తర్వాతే తమలో ఈ ఉత్సాహం కలిగిందని సగర్వంగా చెబుతున్నారు. మొదట్లో పిల్లలుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంతో మంది యువతులు నేడు తమ పిల్లలను ఇక్కడ ప్రదర్శనలో పాల్గొనేందుకు తీసుకు వస్తున్నారంటే బాలోత్సవ్‌తో వారు ఎంతగా పెనవేసుకున్నారో చెప్పకనే తెలుస్తోంది. ముఖ్యంగా కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం తదితర పట్టణాల్లో వాయిద్య సంగీతం (ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్) శిక్షణా కేంద్రాలు విపరీతంగా వెలిశాయి. పిల్లలు ఏదో ఒక వాయిద్యాన్ని నేర్చుకోవడం మనకు కనిపిస్తుంది.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా...!

గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయి పర్యావరణ సమతుల్యతలు దెబ్బతింటున్న నేపథ్యంలో థీమ్‌పార్క్ పేరుతో విద్యార్థులకు ప్రకృతి గురించి అవగాహన కలిగిస్తున్నారు. ఈ కాలం పిల్లలకు ప్రకృతిలోని అనేక విషయాలు తెలియడంలేదు. ప్రకృతిని ఎలా ఉపయోగించుకోవచ్చు అనే అంశాలు థీమ్‌పార్క్ ద్వారా చూపిస్తున్నారు. పిల్లలు ప్రకృతిని ప్రేమించాలనే ఉద్దేశంతో ఈ ఈవెంట్‌ను ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ప్రకృతితో ముడిపడిన అంశాన్ని ఏటా ఒక థీమ్‌గా తీసుకుని దానిని పిల్లలకు వివరిస్తున్నారు. ఉదాహరణకు పూర్వ కాలంలో ఇల్లు, ప్రస్తుత ఇల్లు అంశాన్ని తీసుకుంటే పూర్వం ప్రకృతిని ఎలా

ఉపయోగించుకున్నారో దీని ద్వారా చూపిస్తారు. పూర్వకాలం ఇళ్లల్లో ఉన్న ఉట్టి, రుబ్బురోలు, కవ్వం, కందిలీ, విసుర్రాళ్లు, నాగలి లాంటివి అనేక వస్తువులు ఈ కాలం పిల్లలకు తెలియదు. పాతరోజులకు, ఇప్పటికి వ్యత్యాసం ఎలా ఉంది. ప్రకృతిని గతంలో ఎలా వాడుకున్నాం. ప్రస్తుతం ఎలా నాశనం చేస్తున్నాం అనే అంశాలను ఈ థీమ్‌పార్క్‌ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నారు. వీటితో పాటు ఇంకా 'వ్యర్థంతో అర్థం' అనే అంశంలో పనికి రాని వస్తువులతో ఉపయోగపడే వస్తువులను తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. దీనిలోనూ నిర్వాహకులు సామాజిక స్పృహను వీడలేదు. అలంకార ప్రాయవస్తువులను కాకుండా సమాజానికి ఉపయోగపడే వస్తువులను మాత్రమే తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. దీన్ని బట్టి నిర్వహకులకు సమాజం పట్ల, ప్రకృతి పట్ల ఎంత ప్రేమ ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఇలా యేటా ఒక అంశాన్ని తీసుకొని పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఒక సంవత్సరం, తల్లిదండ్రులను మమ్మీ, డాడీ అని కాకుండా అమ్మానాన్న అని మాత్రమే పిలవాలని మరో సంవత్సరం పిలుపునిచ్చారు. 13 సంవత్సరాల పాటు మమ్మీ, డాడీ అని పిలిచిన ఓ

పాప ఈ కార్యక్రమానికి వచ్చివెళ్లిన తర్వాత నుండి అమ్మా, నాన్న అని పిలుస్తోందని ఓ తండ్రి నిర్వాహకులకు ఫోన్‌చేసి సంతోషంగా చెప్పారంటే బాలోత్సవ్‌లో చేస్తున్న ప్రయోగాలు పిల్లల మనసుల్లో ఎంత బలంగా నాటుకుంటున్నాయో తెలిసిపోతోంది.

చాటింగ్‌లు, ఎస్‌ఎంఎస్‌లు తప్ప ఉత్తరాలు రాయడం తెలియని నేటి బాలబాలికలకు ఉత్తరాల సంస్కృతిని పరిచయం చేయాలన్న తలంపుతో ఈయేడాది "తెలుగులో లేఖా రచన" అనే అంశాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఇన్‌ల్యాండ్ లెటర్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. దానిపై నిర్వాహకులు పోటీ సమయంలో ఇచ్చిన అంశాన్ని గురించి రాయాలి. అలా రాసిన లేఖను పోస్టు చేయిస్తారు. ఆ విధంగా లేఖా సంస్కృతిని పరిరక్షించేందుకు పూనుకున్నారు. ప్రకృతి పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఆర్.వెంకటయ్య అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి బాలోత్సవ్‌లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి పాఠశాలకూ ఒక మొక్కను ఉచితంగా అందజేస్తున్నారు. అంతరించి పోతున్న ప్రాచీన కళలను కూడా యేడాదికి ఒకటి చొప్పున ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి ప్రాచీన కళల్లో తోలుబొమ్మలాటను ప్రదర్శించిన సందర్భంలో పిల్లలు ఆశ్చర్యచకితులై తిలకించారు. ఈ మూడు రోజుల పాటు 'ప్రజాశక్తి బుక్‌హౌస్' ఆధ్వర్యంలో తెలుగుభాషా సాహిత్యం, పిల్లల కథలు, శాస్త్రవేత్తలు, సైన్స్‌కు సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటు ధరల్లో ఉంచడం విశేషం.

నియమ నిబంధనలు

బాలోత్సవ్‌లో పాల్గొనే విద్యార్థులను మూడు విభాగాలుగా విభజిస్తారు. వీరిలో నర్సరీ నుండి 4వ తరగతి వరకు సబ్‌జూనియర్స్, 5వ తరగతి నుండి 7వ తరగతి వరకు జూనియర్స్, 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు సీనియర్స్‌గా విభజిస్తారు. పోటీలో పాల్గొనేందుకు ఈ కింది నియమ నిబంధలు తప్పక పాటించాలి.

★ ప్రతి విద్యార్థి తాను చదువుతున్న పాఠశాల నుండి గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. ★ స్కూల్ యూనిఫారంలో పోటీలలో పాల్గొనరాదు. ★ పోటీలలో పాల్గొను వారు జడ్జీలకు తమ పేరు, స్కూలు, ఊరు పేరు చెప్పరాదు. ★ వ్యక్తిగత పోటీలకు కోడ్‌నెంబర్లు ఇస్తారు. ★ పోటీదారులు తాము పాల్గొనే అంశాలను ధ్రువీకరిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుండి అనుమతి పత్రం పొందాలి. ★ పోటీలకు కేటాయించిన కాలపరిమితిలోనే అంశాలను పూర్తి చేయాలి. అదనపు సమయం తీసుకుంటే అనర్హతగా భావిస్తారు. ★ కూచిపూడి, భరతనాట్యం, సబ్‌జూనియర్స్, క్లాసికల్ డాన్స్, జానపదనృత్యాలు, గ్రూపు డాన్స్‌లు, నాటికల టైం ఎలాట్‌మెంట్ కోసం తమ ఎంట్రీలను వారం ముందుగా పంపించాలి. ★ వ్యక్తిగత పోటీలకు కోడ్ నంబర్లు సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభ దినాన ఉదయం 10 గంటల నుండి ఆయా కౌంటర్లలో ఇస్తారు. ★ పోటీల ఫలితాలు వెంటవెంటనే ప్రకటిస్తారు. ★ విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.

నిర్వాహకుల ఫోన్ నెంబర్లు : 08744-242349, 9849502501, 9849502501, 9397346641, మరిన్ని వివరాలు కోసం www.balotsav.com చూడండి.

- పుప్పాల మట్టయ్య, 9490099332

ఫొటోలసేకరణ : డి. వెంకటేశ్వర్లు

తెలంగాణ ఖ్యాతి దశదిశలా వ్యాపించేలా ఉత్సవాలు

మాతృ భాష, పుట్టిన తెలంగాణ గడ్డ ఖ్యాతిని దశదిశలా వ్యాపించేలా ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఆధునిక ప్రపంచంలోని యువత పాశ్చాత్య సంస్కృతిలో కొట్టుకుపోతోంది. కనుక మన సంస్కృతిని పరిరక్షించాలనే ఉద్దేశంతో పాఠశాల స్థాయి బాలబాలికలతో బాలోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. వారి వలన సంస్కృతి రక్షించబడుతుందని అభిలాష. 1991లో మొదటి సారిగా పట్టణ స్థాయిలో ఏర్పాటు చేసిన బాలోత్సవ్ 2000 సంవత్సరం నుండి రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా ఎదిగింది. తెలంగాణ రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే పేరిణి నృత్యం కాకతీయ ప్రభువుల కాలంలో విశేష ఆదరణ పొందిన వీర నాట్యం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీనితో పాటు మట్టితో బొమ్మలు చేయడం, దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా దాశరథి కవితల పోటీలు ఏర్పాటు చేశాం. 23 సంవత్సరాలుగా. సింగరేణి, పట్టణ ప్రముఖులు ముందుకు వచ్చి స్వచ్ఛందగా బాలోత్సవ్‌కు ఎంతో ఆసరాగా నిలుస్తున్నారు. వారి సహకారంతోనే నేడు జాతీయ స్థాయికి ఎదిగింది. ఇప్పటికే చాల రాష్ట్రాల నుండి విద్యాలయాల ఎంట్రీలతో మంచి స్పందన వుంది. కొత్తగూడెం బాలోత్సవ్ స్ఫూర్తితో ఖమ్మం జిల్లా మధిర, భద్రాచలంలోనూ బాలోత్సవ్ నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండేళ్లుగా తెనాలిలో, 7 సంవత్సరాలుగా ఒంగోలులో, గత మూడు సంవత్సరాలుగా విజయవాడలో, గత ఏడాది నుండి చీమకుర్తిలో బాలల కోసం బాలోత్సవ్‌లు జరగడం చాలా ఆనందదాయకం. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు విద్యార్థులను ప్రోత్సహించడంతో ఈ కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగుతున్నాయి. ఈసారి ఈ జాతీయ బాలల పండుగ బాలోత్సవ్‌కు రానున్న అతిథులు.... తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, కె.వి.రమణాచారి ఐఎఎస్ (రి), ఢిల్లీకి చెందిన ప్రముఖ రచయిత దాసరి అమరేంద్ర, చిత్రకారులు ఏలే లక్ష్మణ్, బెంగుళూరుకు చెందిన 'మనసు ఫౌండేషన్' నిర్వాహకులు రాయుడు. వీరు చిన్నారులతో గడపడానికి, ఉత్సవాలను తిలకించడానికి ఈయేడాది కొత్తగూడెం రానున్నారు.

- డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, బాలోత్సవ్ కన్వీనర్

మౌనం ఆలాపనా..

ఎప్పుడూ రణగొణధ్వనులేనా, ఎప్పుడూ గలగలా మాటలేనా, కాసేపు నిశ్శబ్దం, ప్రశాంతమైన మౌనం ఎంత బావుంటుందో! అనుభవించి చూస్తే కానీ తెలీదు. నిశ్శబ్దంగా ఉండటం అంటే కేవలం మాట్లాడకుండా ఉండటమేనా! మౌనంగా ఉండటం అంటే మనలో మనల్ని శోధించుకోవడం. ప్రశాంతంగా మనలో వచ్చి వెళ్తున్న ఆలోచనల్ని నిశితంగా పరిశీలించుకునే మహత్తర అవకాశం మౌనంతోనే లభిస్తుంది. రోజువారీ హడావిడిలో, సతమతమయ్యే పనులతో మనకి మనమే అపరిచితులం. ఎవరినో మెప్పించడానికి, ఇంకెవరినో ఒప్పించడానికే ఉన్న సమయం సరిపోదు. మనుషులకు 'నేను' అనే అహంకారం ఉండకూడదంటారు. కాని, 'నేను' మీద ప్రేమ తప్పకుండా ఉండాలి. ఏ వ్యక్తి అయితే తనని తాను తెలుసుకుని, ప్రేమించుకోగలుగుతారో వాళ్ళ ఇతరులను తప్పకుండా ప్రేమించి అర్థం చేసుకోగలుగుతారు. అలా తెలుసుకునే ప్రయత్నంలో భాగమే మనకి మనం కేటాయించుకునే నిశ్శబ్ద సమయం మౌనం.

తెలివిగా మౌనాన్ని ఉపయోగించుకోవాలి. మౌనంగా ఉండడం అంటే నిస్తేజంగా ఉండటం కాదు.నిద్రతో కాలక్షేపం చేయడమూ కాదు. మనసు ప్రశాంతమైన కొలనులా ఉండటం. మధ్యలో వచ్చి

పోయే ఆలోచనా తరంగాలపై దృష్టి పెట్టడం. చుట్టుపక్కల పరిస్థితులపై అప్రమత్తంగా ఉండటం, చురుకుగా ఉండటమే మౌనం. మౌనంగా నిశ్శబ్ద సంగీతంలోని స్వరాలు వినగలగాలి. మనసు పలికే రాగాలు ఆస్వాదించాలి. కష్టం వచ్చినప్పుడు కుంగిపోకుండా, సంతోషంలో పొంగిపోకుండా నిలకడగా, నిశ్చలంగా ఉండగలిగే శక్తినివ్వాలి మౌనం. ఆ దిశగా సాధన చేస్తే మనలో వివేకం, వివేచన మేల్కొంటాయనడంలో సందేహం ఉండదు.

ఆంగ్లంలో ఒక నానుడి ఉంది, మాట వెండి అయితే, మౌనం బంగారంలాటిదని. నాలుకను అదుపులో పెట్టుకోవడం అంటే మరి చిన్న విషయం కాదు కదా! మౌనంగా ఉంటే నాలుక అదుపులో ఉంటుంది. అలా ఉంటే ఎదుటివారి గురించి చెడు మాట్లాడలేం. అబద్ధం చెప్పలేం. మన గురించి గొప్పలు చెప్పుకోలేం. నోరు అదుపులో ఉంటే రహస్యం లోపలే ఉండగలుగుతుంది.కొన్ని జీవితాలు కాపాడబడతాయి.

ఎవరు మంచి జీవితం గడపాలనుకుంటున్నారో, ప్రేమ పూరితంగా జీవితం గడపాలనుకుంటున్నారో వారు నిశ్శబ్దంగా మౌన మంత్రం తప్పకుండా చదవాలి. మన మాట కూడా మౌనమంత శక్తివంతంగా ఉండాలి. అప్పుడే మౌనం బంగారమంత అమ్యూలంగా ఉంటుంది. అలానే అన్నిటికీ మాటలే సమాధానంగా చెప్పాల్సిన పనిలేదు. మౌనంగా కూడా ఎంతో మాట్లాడొచ్చు. నిశ్శబ్దం ఎంతో మాట్లాడుతుంది.

సోలోమన్ అంటాడు, 'ఎవరైతే వారి మాటలను బయటకు రాకుండా నిలుపుకోగలుగుతారో వారు తెలివైన వారని అవతలివారు అనుకుంటారు. అది తెలివితక్కువ వ్యక్తి అయినా కావచ్చు కాని, తక్కువ మాట్లాడేవారు తెలివిగల వారుగానే చెప్పబడతారన్నది వాస్తవం.' అందుకే మౌనం బంగారంలాటిది. మౌనంతో ఏకాగ్రత పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

అయితే మౌనం అన్నివేళలా బంగారం కాదు. మాట్లాడాల్సిన చోట మాట్లాడాలి. లేకుంటే ఆ సమయంలో మౌనం పిరికితనానికి నిదర్శనం అవుతుంది. గట్టిగా మాట్లాడాల్సిన సమయంలో మౌనంగా ఉన్నారు అంటే వారు తప్పు చేసినవారైనా కావాలి, లేదా అప్పగించిన బాధ్యతను పూర్తి చేయలేకపోయిన లాటి సందర్భం ఏదైనా కావచ్చు. అప్పుడు మౌనం వారి తప్పుకు అంగీకారం అవుతుంది. అలా కాకుండా కొన్నిసార్లు నిజం చెప్పి అవతలి వారిని ఇబ్బంది నుంచి తప్పించాల్సిన అవసరం రావచ్చు. అటువంటప్పుడు మౌనం దాల్చడం ఎంత ప్రమాదం! అందుకే మౌనాన్ని మంచికే కాని, అనర్థానికి ఉపయోగించకూడదు.

- శ్రీదేవి

జోక్స్ కార్నర్ ■

ఫ్యాషన్ డిజైన్

మంగారావు: నువ్వెప్పుడూ కొత్తగా వచ్చిన ఫ్యాషన్ డిజైన్ల పుస్తకాలనే కొంటావెందుకు?
గంగారావు: వాటిని చూస్తేనే కదా నా బిజినెస్ సక్సెస్ అయ్యేది?
మంగారావు: అదేమిటి?
గంగారావు: సరికొత్త డిజైన్లలో ఎక్కడెక్కడ జేబులుండాలో తెలుసుకోవాలి కదా? (అసలు విషయం చెప్పాడు జేబుదొంగ గంగారావు)

డిపాజిట్

నా పేరు మీద బ్యాంకులో పది లక్షలు డిపాజిట్ చేశారు మా డాడీ" రమేష్ గొప్పగా చెప్పాడు ప్రియురాలితో.
"అవునా డియర్! మనం రెండు నెలల వరకు ఆయన్ని మళ్ళీ అడగనక్కర్లేదన్నమాట" అంది గోముగా కల్యాణి.

చతురుడు

ఎక్కువగా మాట్లాడే స్త్రీని 'అతిగా వాగకు నోర్మూసుకో' అంటాడు మూర్ఖుడయిన మగాడు. అదే

తెలివిగ మగవాడు అయితే 'నీ పెదాలు మూసుకొని వుంటే అందంగా కనిపిస్తావు సుమా' అని చెబుతాడు.

ఉపన్యాసం

ఒక సమావేశంలో అసలు ఆపకుండా ఉపన్యసిస్తున్నాడు రామేశం. ప్రసంగించటం ముగించి తన కుర్చీలో కూర్చుని వున్న ఒకే ఒక వ్యక్తిని చూసి ఇలా అడిగాడు: "చాలా



కృతజ్ఞతలు. అందరూ వెళ్ళిపోయినా మీరు ఒక్కరే కూర్చుని నా ఉపన్యాసం శ్రద్ధగా విన్నందుకు".
శ్రోత: ఏం చేయను. నాకు కూర్చోవడం తప్పలేదు. మీ తర్వాత మాట్లాడవలసిన వ్యక్తిని నేనే కదా!

*

■ **ఇంటర్వ్యూ** ఓ మోస్తరు గాలొచ్చినా... కొట్టుక పోతాడేమో... అనిపించేంత బక్క పల్చజీవి. మాసిన గడ్డం, ముతకలాల్చి, సంకన సంచి, చెప్పుల్లేని కాళ్లు, పల్లె, పట్నమంతా తిరిగాయి. తానే... ఓ పాటల ప్రభంజనం. ఎందరి హృదయాల్నో కదిలించాడు. పాలకుల్ని కుదిపేశాడు. శతమానం పాటలతో "చెడుగుడు" అడుకున్నాడు. ఆయన పాటల పరుగుల రాజు, మన జయరాజ్...ఫక్తు ఉద్యమకారుడా, పక్కా రాజకీయనాయకుడా...? అంటే ప్రజా వాగ్గేయరాజ్. బాల్యం నుండే బ్రహ్మాండమైన పాటల బైరాగీ... ఓ సీతాకోకసిలుకా? నీ... బాధ లెవరికెరుకా... అందమైన నీ.. రూపం వెనుక అంధకారమే దాగి ఉన్నదట.. ఆ బాధల గాథ జీవిత మలుపుల్ని మనతో పంచుకుంటున్న, పాటల పుట్ట అన్న జయరాజ్‌తో... 'భూపతి' ఈ వారం 'సోపతి'

ప్రాణమైన పాట

గిది...తెలంగాణ-ఇంటికి చుట్టమొస్తే తలకాయ కోసి పీటేసే సాంప్రదాయం, ప్రేమాభిమానాల గడ్డ, ఆప్యాయతలకు అడ్డా. ఇగ మా ఊర్లు అనుబంధాల ఊట బావులు, మాది వరంగల్ జిల్లా మహిబాద్ (మహబూబాబాద్) పక్కన గుమ్మనూర్.

నేను...ఓ దొర జీతగాని కొడుకును, పెద్దకుటుంబం. కాని.. పేద కుటుంబం. సేను, చేలక సెంటు భూమి లేనోన్ని. అవ్వ అయ్యా కన్నీళ్ళు చూసినా. చదువు ఆకలి, అవమానాల్ని చెడ్డిలనాడే... అర్థం చేసుకున్నా... బువ్వ కోసమే హాస్టల్‌ల్లో జెరినా. పొద్దుతోనే పోటీ పడ్డా... ఆకలిని చంపుకున్నా, పేదరికం వెంటాడింది. చెలల్లో దోసకాయలు జొన్న పిస్కిళు ,, వాగు పక్కన సీతాఫల్కయాలు, ఎండకాలమైతే తాటి ముంజలు, తాటిపండ్లు మా కడుపు నింపాతాయి. అయినా.. కాలం కాటేసింది, కరువు చుట్టుముట్టింది. మా ఊరు నుండివలసెల్లి నల్గొండ జిల్లా కల్మల చెరువు గ్రామమొచ్చిన. మా కన్నీళ్ల ఆగలె... కష్టాలు తీర్చలేదు. నా బాల్యం కటిక దారిద్యం. పేదరికం దయలేనిది. అదంటే 'కసి' కాని..'కానీ' చోటుకు వెళ్ళలేదు. 'కాణి' చుట్టు తిరగలేదు. దాని అంతం నా పంతం. కర్మ సిద్ధాంతాన్ని ఎవ్వడు, ఎప్పుడు పెంచి పోషిస్తున్నాడో అర్థంగాలే. ఇది "తలరాత"రా అని మా తల్లంటే కొద్ది కాలం నమ్మినా... మన తాత ముత్తాతల మేడకి ముంత ముడ్డికి తాటాకుతో బజార్లల్ల తిరిగిన వైనం నీకు దెల్వదు బిడ్డా! అని అమ్మమ్మ అంటే ఆశ్చర్యపోయినా... నా బడిలో బాపని పంతులు చదువు చెప్పేది. మనువు, వేదం గురించి, కులనిచ్చెన మెట్ల గురించి, ఐదు వేళ్ళు చూయించి శూద్రుడు, పంచముడు ఎక్కడ ఉండాలో గిరి గీసి చెప్పిండ్రు. నా పెయ్యి సలసల కాగింది. కాని పేదోని కోపం పెదవి దగ్గరే.. చినిగిన లాగు, చిమిడి ముక్కు, చింపిరి జుట్టు నన్ను ఎగతాలి చేసిండ్లు. అయినా చదువుల్లో వెనక్కిపోలేదు.

ఏం చదివినా, ఏది విన్నా మరిచి పోవడమంటూ ఉండదు. పద్యమైనా, పాటైనా గడగడా అప్పజెప్పేది. నా తోటోళ్లు ఆశ్చర్యపోయేలా తల ఎగరేసి జవాబిచ్చేది. పద్యం, పాటైంది, భాగవతం, భారత, రామాయణాలు, తెలుగు వ్యాకరణం, దళిత సాహిత్యం లోతుపాతుల్ని తెలుసుకున్నా. ప్రకృతి పద సంపద సొంతం చేసుకున్నా. తెలంగాణ యాసంటే నాకిష్టం. అందులో పాండిత్యం లేకపోవచ్చు. ప్రేమ ఉంటది. మట్టివాసనలు, పగోడ్ని, పరిగెత్తించి, ఇంటోన్ని హుషారు చేసే శక్తి.. ఆ పదును మాండాలికానికుంది. పెద్ద చదువులు చదవలేదు. పెద్దోని సోపతి చేయలేదు. అత్తెసరు మార్కులతో ఐటిఐ చేసి సింగరేణి గని కార్మికుడిగా స్థిరపడ్డా... సింగరేణి సైరన్ మోత నా పాటల ఊట కార్మికులకు బలాన్నిచ్చాయి. పుస్తకాలకు దూరంగాలే... సంక సంచిలో పుస్తకాలు తప్ప బట్టల్లేవు. నాదంతా అల్లిక సాహిత్యం, అమ్మమ్మ వారసత్వం, నా మూలాలు యాది చేసుకొని అక్షరాలతో అల్లిన నా పాటలంటే నా ప్రజల కిష్టం.

జనంతో మమేకమై..

మొదట్నుంచి నా మనస్సు సున్నితం. ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేను. అవతలి వాళ్లు ఒడ్డున పడేదాక ఆలోచనలు... అంబేద్కర్, కారల్ మార్క్సును చదివినా... ఆకలికి మార్క్స, అవమానానికి అంబేద్కర్ నాతోటి పేదలకు సూర్య చంద్రులని నమ్మినాను. నా దేశానికి కులం చేసిన కీడు అంతా ఇంతా కాదు. కార్మికులను ఐక్యంగానియ్యాలె, కల్సి ఉండనీయ లేదు.

మనిషి నరాల్లో మనువాదం ఆవరించింది. దశావతారాల్లో బుద్ధని కూడా కలుపుకుంది. ప్రేమతత్వం నేర్పిన జీసస్‌ను హైందవ దేవుడిగా మార్చింది. ప్రపంచకార్మికులారా! ఏకంకండి అన్న కమ్యూనిస్టులను ఏకం కాకుండా చేసింది. నా ప్రధాన శత్రువు కులం.. వాటి పునాదుల్ని కూల్చాలి అనుకున్నా. కులంపై పాటలు రాసినా... ప్రకృతి సంపద అంటే... తల్లిగా.. శ్రమ.. అంటే.. తండ్రిగా ప్రకృతి యే గొప్ప 'కమ్యూనిస్టుగా' భావించాను. గాలి నీరు వేడి వెన్నెల అందరికీ సమానంగా ఇచ్చింది. భూమిని దున్నగలిగిన వాడు దున్నుకోండి, తినగలినంత తినండి అంది నా ప్రకృతి. స్వార్థం

అనే గండ్ర గొడ్డలి ఈ అసమానతలు సృష్టించింది. భూపుత్రులకు భూమి దక్కకుండా చేసింది.

ప్రకృతి నా తత్త్వమైంది. "వానమ్మ, వానమ్మ, వానమ్మో ఒక సారన్న వచ్చి పోవే వానమ్మా" అని వాన గురించి రాసినా... ఎంత చక్కటిదమ్మ నన్నుగన్న తల్లి ఎంత చల్లనిదమ్మా ఈ నేల తల్లి అని నేల తల్లి గురించి, రూపమన్నది లేని వాడికి రూపమిచ్చిన జాతినాది...ఏడుకొండల వేంకటేశుని ఎత్తి చూపినాను అని రాళ్ళ గురించి, పంటచేను మీద, చెమటచుక్క మీద చీకటి, వెలుగు, జననం, మరణం, కన్నీళ్లు, ఆనందాలు అలవోకగా అల్లినవే. ఎవరు గింజలు చల్లారని అడవి మొలిచింది అని, ఎవరు అడిగితే జయరాజ్ పాట రాయలేదు. సహజత్వం మదిలో మెదిలితేనే నా పాటలు. అసలు నా జీవితమే ముళ్ళబాట. ఉద్యమంలో రాళ్లబాట. నిర్బంధం నాకొక కానుక, గాయాలు, రోగాలు వేడుక, నా బతుకులో భాగమయింది. పచ్చని చెట్టు నేనురా... పాలుగారే మనసు నాదిరా... కొమ్మను రెమ్మనేను... నీకు తోడుగ ఉండే అమ్మను అని రాసాను.

కళారంగంలో నా కంటే పెద్దోళ్లు ఉన్నారు. నేను మొదలు కాదు చివర కాదు. పాటల గొలుసులో చిన్న లింక్‌ను మాత్రమే. నాది వామపక్ష కమ్యూనిస్టుల సంబంధం. ప్రజలున్న కాడికి పరిగెత్తే స్వభావం-పేదోడు, పెద్దోడు తేడా లేని "నిజం" అది ఒక్కటే సోషలిజం అని నమ్మినోడిని. ఆ బాటలోనే ముళ్ళు, రాళ్ళు కొండలు బండలు పక్కకు జరుపుతున్నా. సేతగాని రోజు స్నేహితులను చేరదీసుకుంటున్నాను. ఎగరెయాల్సిన చోట ఎర్ర జెండా లెగరేస్తున్నాను. మార్క్స్ అంబేద్కర్ ఆశయాలు అల్లుతున్నాను. ఆ వెలుగుబాటగా నమ్ముతున్నాను.

చెట్టు గురించి పాడితే నాకళ్ళ వెంట కన్నీరు పారుతుంది. నా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. నా యాస, భాష నా పల్లె జీవితంలో మన్ను బోసింగ్రు. పంటలు పోయి పల్లేర్లు మొలిసినాయి. కూసున్న చోటే ఏడ్చింగ్రు. పల్లె.. ఉసురు తగులుతుంది. నా పాటలతో పల్లె ప్రజలకు ఉపిరి పోసినా... తెలంగాణ ఉద్యమంలో పరిగెత్తించినా... ఒక్క మాట చెబుతా... జర వినుండ్రి.. తెలంగాణాలో...'పాట' లేకుండా ఇక్కడ ఏ 'తూటా' పేలదు. రాజ్యమున్నది, రాజ్యహింస ఉన్నదని తెలిసే రాజ్యం ముఖం మీద చాచి దెబ్బ కొట్టగలిగింది పాట. ఈ రాజ్యం రెండు తలల పాము. అది ఎటు నుంచయినా కాటేయగలదు. ఆ పాము విషపుకోరలు కూడ పీకమన్నది నా పాట. కొనదాకా కొట్లాడేటోడే సిపాయి కొన ఉపిరి ఉన్నదాకా... అటో ఇటో నీవు ఎటువైపు? ప్రజలవైపా? ప్రభుత్వం వైపా? తేల్చుకో... "వీరుడ్ని యుద్ధరంగాల్లోనే చూడాలి. ప్రజా కళాకారుడు ప్రజల్లోనే ఉండాలి" అన్న 'మావో'ను యాదిచేసుకో... ప్రజా సాంస్కృతిక నినాదం నేటి "నిజం"-నేటి "విజన్" గావాలి.

కళారంగంలో నా కంటే పెద్దోళ్లు ఉన్నారు. నేను మొదలు కాదు చివర కాదు. పాటల గొలుసులో చిన్న లింక్‌ను మాత్రమే. నాది వామపక్ష కమ్యూనిస్టుల సంబంధం. ప్రజలున్న కాడికి పరిగెత్తే స్వభావం-పేదోడు, పెద్దోడు తేడా లేని "నిజం" అది ఒక్కటే సోషలిజం అని నమ్మినోడిని. ఆ బాటలోనే ముళ్ళు, రాళ్ళు కొండలు బండలు పక్కకు జరుపుతున్నా. సేతగాని రోజు స్నేహితులను చేరదీసుకుంటున్నాను. ఎగరెయాల్సిన చోట ఎర్ర జెండా లెగరేస్తున్నాను. మార్క్స్ అంబేద్కర్ ఆశయాలు అల్లుతున్నాను. ఆ వెలుగుబాటగా నమ్ముతున్నాను.

స్నేహమేరా జీవితానికి వెలుగునిచ్చే వెన్నెలా
స్నేహమేరా బతుకు బాటలో నీడనిచ్చే తోడురా
పేదవాళ్ళతో స్నేహము పెరుగు బువ్వా చందము
కష్టజీవుల బంధము-కలిసి నడిచే మార్గమూ

ఆ మార్గంలో నడిచే వారితో సోపతి గడుతున్నాను. నా 'సోది'ని ఈ 'సోపతి'కి సొంతం చేసుకుంటున్నాను.

నా పాటలు- పగ బట్టాయ్
కొండల్లో కోయిల పాటలు పాడాలీ
పల్లెల్లో అక్షర దీపం వెలగాలి
ప్రతివాడు ఒక తిక్కన అయి 'నవ భారతం' రాయాలన్నా
ప్రతి చెల్లి ఒక మొల్లవోలె నవ రామాయణమే చెప్పాలమ్మా

అంటూ... పాట రాశాను. తరతరాలుగా చదువుకు దూరమైన నా జాతిని మేల్కొలిపేందుకు 'అక్షరం' గొప్పదనం గురించి రాస్తే... తప్పు అని నాపై పగబట్టారు. నా తోటి అన్నలు, అనుమానపు చూపులు,

అనవసరపు చర్చలు. ఆర్.నారాయణమూర్తికి అమ్ముడు పోయినావని ఆరు నెలలు పార్టీ నుండి బహిష్కరించారు. 'కులం' ఉన్నది అంటే.. కులతత్వం మంటగట్టారు. అయినా అక్షరం ఆయుధంగా, పాట ఓ తూటాగా పాటల తోటమాలిగా బతుకుతున్నాను.

మాలోడి బతుకొద్దు మాదిగ బతుకొద్దు
ఊరికి దూరంగా ఎట్టి బతుకులు వద్దు
కత్తిలా నువ్వు మెరువరన్నా ఓరన్నా
దొరలకెదురు తిరగరన్న మాయన్నా

అంటూ నా జాతి జనులను జాగృతం చేస్తున్నాను. తెలంగాణా ఉద్యమంలో నా పాటలు పురుడు పోసుకున్నాయి. అనుభవిస్తున్న అంతర్మథనానికి అసరా దొరికింది. గుక్కెడు నీళ్ళు లేక గుక్క పట్టి ఏడుస్తున్న తెలంగాణ పల్లె దీన గాథ ఇది.

ఇంకేమి మిగిలిందిరా...పల్లెల్లో...
జిల్లేడు మొలిచిందిరా..పల్లెల్లో
పల్లేర్లు కాసిందిరా...

అంటూ కన్నీరు కార్చడం కాదు, కసితో కత్తులు దూయాలని, పోరాటం లేకుండా బతుకు లేదని చాటి చెప్పిన.

అన్నా చెల్లెలి అనుబంధంపై కన్నీళ్లతోనే నా కలం కదిలింది.
సంకల్లో ఎత్తుకున్నాను...
సద్ది మూటలే మోసుకున్నాను...
రెక్కలమ్ముకొని పైస పైస ఎనుకేసి

పలక బలుపాలిచ్చి సక్కగా చదివించి...

ఆకలని మీరంటే అల్లాడి పోతూ...

అన్నా..ని మీరంటే నే-పొంగి పోతూ.. మీకు ఏమన్న జరిగితే నే కన్ను మూస్తా.. కలగంటి కలగంటి కలగంటినమ్మా నేను కలగంటినయ్యా. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు మదిలో మెదిలిండ్రు. కన్నీళ్ళతోనే తడిసి పోయినాను. ప్రేమ పెళ్లి, కులాంతర వివాహాలపై పాట రాయాలనిపించింది.

అందానికా పిల్ల చందమామ

మనసు జూస్తే...మంచి జాజికొమ్మ

పని పాటలో నాకు తోడుంటది

నా గుండె గదిని దాటి పోనంటది

అయినా... మా అయ్యా...వద్దంటాడు

ఆ పిల్ల జోలికి పోతే కుల మంటాడు

అమ్మా నీ మనసు మారదాయె...

నాన్నా నీ గుండె కరగదాయె....

అని ప్రేమ పెళ్లిలో పాడినా... వ్యతిరేకించిన తల్లిదండ్రులను అర్థం చేయించింది నా పాట. వాళ్లను అక్కున చేర్చింది పాట. బాహ్మణులకు వేదాలను రాజులకు రాజ్యాలను వైశ్యులకు ధనాన్ని మరి శూద్రులకు, శ్రామికులకు ఏమిచ్చినవు? అని ప్రశ్నించిన.

జగోరే... జాగో అంబేద్కర్

భవితకు మార్గం అంబేద్కర్

భారత్‌కు మార్క్స్ అంబేద్కర్ అని రాసి పాడినా...

మనువాదానికి మరణ శాసనం రాస్తున్నా మిదిగో..

సామ్యవాదపు మార్క్స్, అంబేద్కరుపై వస్తున్నా మిదిగో...

నీ బ్రహ్మకే దిమ్మ తిరిగేటట్లు మీ రాతలు చెరిపేస్తాము... అని బ్రాహ్మణిజాన్ని నిగ్గదీసినా నా పాటా నా హక్కుల్ని లేవదీస్తున్నా ఒకర్ని కించపరచటం, మోసపరచటం తెలియదు. నిజాన్ని నిర్భయంగా చెప్పడం నా ప్రవృత్తి. నా డప్పుకు, చెప్పుకు నా వృత్తికి దూరం చేసి ఉపాధి చూయించలేని సర్కార్‌కు సవాల్ విసురుతున్నాను. బాధల మూటల్ని బహిర్గతం చేస్తున్నాను. నా చరిత్రంతా పరమ చండాలుని చరిత్ర, ఇప్పుడు నేను ద్రోణుని ద్రోహాన్ని గుర్తించి, బాణం సంధించిన ఏకలవ్యున్ని. మనువు కళ్ళల్లో సూదులు గుచ్చుకొని, నాలిక తెగ్గోసుకొని చెవిలో సీసం పోసుకొని స్మశానాలల్లో దొర్లాడుతున్నట్టు 'కల' గంటున్నవాడ్ని, కాలం కసాయి కత్తి మీద నిలబడి గర్జిస్తున్న పాటల జాంబవంతుడ్ని. కుల దురంహంకారులపై నా 'పాటల' వేటకుక్కల్ని ఉసిగొల్పుతున్న నిషిద్ధ కులపోణ్ణి, నిషిద్ధ పాటగాణ్ణి.

అక్షరాన్ని అణచివేయ్ అది అనలమై మండుతుంది అని సవాల్ విసిరి జవాబు చెప్పినాను. బువ్వ పెట్టిన చెయ్యి బుద్ధి నేర్పిన పల్లె ఋణం తీర్చుకుంటాను. కావలి కుక్కగా పని చేస్తాను. నా మాటగా మనోళ్లకూ... దళిత ఉద్యమాలు, బహుజన ఉద్యమాలు గతకొన్ని ఏండ్లుగా పాలకుల కచ్చడం బండిగా అధికార సోపానాలకు సహకరిస్తున్నారు. ఇదే ఐక్యతకు ఆటంకంగా ఉంది. సొంతకాళ్ళపై నిలబడిన ఉద్యమాలే... చరిత్రలో నిలిచాయి. నిలుస్తాయి. సొంత కాళ్ళపై నిలబడుదాం.

చావును ఓడించినా...పాటగా బతికినా...

పేదోనికి రాకూడని పెద్దజబ్బు క్యాన్సర్ సోకి నా కడుపులోని పేగులన్నింటినీ తినేసింది. చూసిన డాక్టర్లందరూ, రెండు మూడు నెలలే అన్నారు. అయినా... ఎందుకో నాకు చావును జయిస్తానని గట్టి నమ్మకం. అదే నమ్మకంతో ఆపరేషన్ చేయించుకున్న. కడుపులోని పేగులన్నింటిని తీసేసి కుట్లు వేశారు. ఆపరేషన్ చేసి పునర్జన్మ నిచ్చిన డాక్టర్ బీరప్పకు పరి పరి దండాలు. ఈ డాక్టరు మా పాలిట ప్రాణమని నా పాటకు ఊపిరిగా కొలుస్తున్నా.. నా పాటల బండికి 'ఇరుసు' నా జీవిత భాగస్వామి మంగ. నా కంటి పాపలు సాధన్, నిశాంత్ నా ఆరోగ్యాన్ని అంటి పెట్టుకొని ఉంటారు. నా పాటకు ఆయుష్షు పోస్తున్నారు.

అప్పటికి క్యాన్సర్ ఆపరేషన్ జరిగింది. కడుపుపై కుట్లు "పచ్చి" ఆరలే. తెలంగాణ ఉద్యమంలో పాట, ఆట పరిగెడుతున్న కాలం, నే ఆగితే ఎట్లా?

నా చరిత్రంతా పరమ చండాలుని చరిత్ర, ఇప్పుడు నేను ద్రోణుని ద్రోహాన్ని గుర్తించి, బాణం సంధించిన ఏకలవ్యున్ని. మనువు కళ్ళల్లో సూదులు గుచ్చుకొని, నాలిక తెగ్గోసుకొని చెవిలో సీసం పోసుకొని స్మశానాలల్లో దొర్లాడుతున్నట్టు 'కల' గంటున్నవాడ్ని, కాలం కసాయి కత్తి మీద నిలబడి గర్జిస్తున్న పాటల జాంబవంతుడ్ని. కుల దురంహంకారులపై నా 'పాటల' వేటకుక్కల్ని ఉసిగొల్పుతున్న నిషిద్ధ కులపోణ్ణి, నిషిద్ధ పాటగాణ్ణి.

అనుకున్నా. ఇగ నా పాటల బండి కట్టినా. శ్రీరాంపూర్‌లో పాటపాడుతున్నా. జనం జేజేలు, పాట జోస్‌లో ప్రాణాన్ని మరిచినా... గట్టిగా పాటేత్తుకున్నా.. ఊపిరిబిగ పట్టిన రాగంతో నేను.. కోరస్‌తో ఊరి జనం. పచ్చిగున్న కుట్లు ఒక్కసారి భళ్లున తెగినాయి. పేగులు బయట కొచ్చినై. స్టేజంతా రక్తపు మడుగు. అయినా చూసుకోలే... నా పాదాలు రక్తపు మడుగులో నర్తించిన తీరును గమనించినా జనం అంతా... స్టేజిపై వచ్చేదాకాపాట ఆపలే... అప్పుడు తెలిసొచ్చింది. 40 కుట్లు ఆపరేషన్ జరిగి మానని పుండు సలుపులు తీస్తుందని. పాటగానే కన్ను మూస్తానని పాటకు దండం పెట్టుకున్నా. ఇగ నా ప్రాణం పోతుందని అనుకున్నాను. పొట్టపై చేతులు తడిమినా... నా పేగులు నా చెయ్యికి తగిలినాయి... బయటికొచ్చిన పేగుల్ని లోనికొత్తుకున్నా. కారుతున్న రక్తాన్ని ఒడిసి పట్టుకున్న. పెయ్యిపై ఉన్న ఎర్ర కండువ బిర్రుగా కట్టినా... నా ప్రజలకు దండం పెట్టుకున్నా. అమరులను యాది చేసుకున్నా. ఆలి పిల్లలకు అభయ మిచ్చినా కోయిలనై కుస్తానని.. పల్లెల్లో ప్రమిదనై ఉంటానని అనుకున్నాను. రెండుదినాలు సోయి లేదు. ఆ తర్వాత కండ్లు తెరిచినా. హాస్పటల్ నుండి పాట బతికింది. అడుగడుగున గండాలు దాటింది. చావుకే సవాల్ చేసి సాగింది... నా బతుకుబండి. నల్గురు కూడిన చోట కనిపిస్తా ప్రాణమైన పాట, పాటతోనే ప్రాణం విడుస్తా...

- భూపతి వెంకటేశ్వర్లు, 9490098343

■ **నవరాగం**

చూపులన్నీ ముళ్ళు కావు!

అదే క్షణంలో మరో ఆలోచన వచ్చింది... టీవీలోనో, బయటనో ఒక అమ్మాయిని చూసి "ఆ అమ్మాయి జడ ఎంత బావుందో..." అని ఒక మగవాడు తన ప్రియురాలితోనో, భార్యతోనో అంటే భరించగలిగే వారు ఎందరు! అలా చూడకూడదని సినిమాలు, సీరియల్స్, సమాజం చెబుతుంటుంది.

టీవీలో ఏదో ప్రోగ్రాం వస్తోంది. కాఫీ తాగుతూ చూస్తుండగా "అతని నవ్వు ఎంత బావుంటుందో... చాలా మనోహరంగా వుంటుంది" ఒక రియాలిటీ షోలో కనిపిస్తున్న నటుడ్ని ఉద్దేశించి ఆనంద పరవశంతో అంది రమణ భార్య చందన.

"ఔను అతని నవ్వు భలే వుంది" అంటూ ఆమె మాటకు తలూపాడు రమణ.

రమణ ముందే చందన హాయిగా అలా మాట్లాడగలగడం మిత్రుడు సురేష్‌కు ఆశ్చర్యం కలిగించింది. కానీ అంతలోనే ఈరోజుల్లో అదేమంత విస్మయం చెందే విషయం కాదనిపించింది. ఎందుకంటే జ్యోతి తన క్లాస్‌మేట్ ప్రభాకర్ గురించి ఎన్నోసార్లు తన ముందు హాయిగా మాట్లాడటం తెలుసతనికి.

అయితే అందరూ ఇలా ఉంటారా? ఉండగలరా?

భర్త ముందు మరొక మగవాడి నవ్వు మనోహరంగా వుందని మనసులోని మాటని చెప్పే ధైర్యమా అని కొందరు విస్తుపోవచ్చు. కానీ అలా చెప్పగలిగిందామె.

అదే క్షణంలో మరో ఆలోచన వచ్చింది... టీవీలోనో, బయటనో ఒక అమ్మాయిని చూసి "ఆ అమ్మాయి జడ ఎంత బావుందో..." అని ఒక మగవాడు తన ప్రియురాలితోనో, భార్యతోనో అంటే భరించగలిగే వారు ఎందరు!

అలా చూడకూడదని సినిమాలు, సీరియల్స్, సమాజం చెబుతుంటుంది. కానీ మోములోని మందస్మిత సౌందర్యాన్ని, ఒత్తయిన జడ గల స్త్రీలోని ముగ్ధత్వాన్ని చూడకూడదని తీర్మానించుకోడం సాధ్యమా?

అతను (భర్త లేదా ప్రియుడు) ఉండగా ఒడ్డు పొడుగు వున్న ఆరు అడుగుల మగవాడిని చూడకుండా తలదించుకుపోవాలని ఆడవాళ్ళకు చెప్పడం సబబేనా? తనకు భర్త/ప్రియుడు ఉన్నాడు కాబట్టి తాను ఇక ఎవరినీ తలెత్తి సూటిగా చూడకూడదని, చూసినా, ఎదుటి మనిషిలోని ఆకర్షణీయ అంశాలేవీ తనకు కనిపించకూడదని నిర్ణయించుకోవడం అయ్యే పనేనా?

చూపులకు ముళ్ళుంటాయి... అనే మాట కొంత నిజం కావచ్చుగానీ... అన్ని వేళలా అది నిజం కాదు. ఒళ్ళంతా గుచ్చుకునేలా ఆ చూపులేమిటనే ఈసడింపులు కూడా అబద్ధం కాదు. కానీ అన్ని చూపులు ఈసడింపునీ, ఏహ్యతనీ కలిగించవు. ఎందుకంటే చూపులన్నిటిలో కోర్కె ఉండదు.

నిజానికి తరచి చూస్తే ఒక స్త్రీని లేదా ఒక పురుషుని చూడగానే బలమైన వాంఛ కలుగుతుందనే మాట అబద్ధం. ప్రతి రోజు అనేకమందిని చూస్తుంటాం, మాట్లాడుతుంటాం. అంతమాత్రాన అందరి పట్ల కోర్కెలు, ఇష్టాలు కలుగుతాయా? ప్రతి చూపులోనూ ఇష్టం కనిపిస్తుందా? అంతటి కాముకత్వం నిరంతరం మనుషుల్లో ఉంటుందని ఏ సైన్స్ కూడా చెప్పలేదు. అందుకని అనవసరంగా మనుషుల్ని అనుమానించకూడదు. అనుమానించడమంటే అవమానించడమే. అనుమానించడం ద్వారా, కట్టడి చేయడం ద్వారా మనుషుల్ని నియంత్రించాలనుకోవడం అర్థరహితం.

మరొకళ్ళను చూడకూడదనుకుంటే ఈ లోకంలో మనుషులు ఎవరూ బతకలేరు. తను, తను ఇష్టపడ్డవాళ్ళు మాత్రమే భూమి మీద వుండాలి. మిగతా వాళ్ళంతా అంతర్ధానం కావాలి. ఇదెంత అమానవీయమైన కోర్కె!

ప్రేమంటే తాము మాత్రమే ఈ భూమ్మీద మనుగడ సాగించాలనుకోడం కాదని మరల మరల గుర్తు చేయాల్సిన సందర్భంలో వున్నాం. నిజంగా ఒకరి పట్ల మరొకరికి ఉండే ఆపేక్ష లోకం క్షేమాన్ని కోరాలి. పదుగురి మేలుని తలవాలి. ఈర్ష్య, అసూయ, ద్వేషం అనే పదాలు తెలియనంత మమకారాన్ని, కరుణను చూపాలి. ఇదే ప్రేమలోని మానవీయ లక్షణం.

నిజంగా గాఢమైన ప్రేమ గల మనిషి చూపులు ఒకచోటనే కేంద్రీకృతమై వుంటాయి. ఇతరేతర దాపుల్లో సంచరించవు. లోకవ్యవహారాల్లో, కర్తవ్యపాలనలో ఎందరెందరితోనో సంభాషించినా లోలోపలి ప్రేమ మాత్రం ఎక్కడ వుండాలో అక్కడే నిలిచి వెలుగుతుంటుంది. పరమ ఇష్టంగా చూడటం ఇష్టమైన వారి పట్లనే వుంటుందని గుర్తుంచుకుంటే చూపులన్నీ ముళ్ళు కావని గ్రహించగలరు.

– ప్రణీత్

కౌగిలిలో కనువాల్చిన ప్రియురాలి పెదవి – కలకాలం కోరదగ్గ దేవేంద్ర పదవి – ఆరుద్ర

నేస్తం



ఎవరి బాణం?

నలుగురు వీరులు బాణం వేయడంలో పోటీ పడ్డారు. వారిలో ఒక్కరిదే సరిగ్గా చక్రం మధ్యలో దిగి లక్ష్యం చేరుకుంది. అది ఎవరి బాణమో చెప్పగలరా?

జవాబు : D

ముక్కులో ముల్లు

పొద్దు పొద్దున్నే లేచిన పిచ్చుక అమాంతం వెళ్ళి జొన్న కంకి మీద వాలింది. అది టక్కుమని జొన్నకంకిని పొడిచింది. పుటుక్కుమని దాని ముక్కులో ముల్లు విరిగింది. బండరాయికేసి ముక్కును అటూ, ఇటూ బరబరామని రుద్దుకుంది పిచ్చుక. కానీ ముల్లు రాలేదు. ఎదురుగా చెట్టు మొదలు మీద టకటకమని బెరడు మీద ముక్కుతో కొడుతోంది వడ్రంగి పిట్ట. కొన్ని పురుగులు బెరడు కింద నుంచి వెలుపలకు రాగానే, తన పొడవైన ముక్కుతో పట్టుకుని లటుక్కుమని గొంతులో వేసుకుంటోంది.

"ముక్కు మావా... ముక్కు మావా.. జరంత నీ ముక్కుతో నా ముక్కులో ఇరిగిన ముల్లును తియ్యవా?" అడిగింది పిచ్చుక.

"చెట్లను పొడిచీ.. పొడిచీ... ముక్కు మొద్దు బారిపోయింది. మరోపిట్టను వెదుక్కోపో" అంది మళ్ళీ బెరడును టక టకమని పొడుస్తూ.

అక్కడ్నించి లేచి, రివ్వున చెరువు ఒడ్డున వాలింది. చెరువులో తెల్లకొంగ ఒంటి కాలి మీద నిలబడి దగ్గరి కొచ్చిన చేపల్ని ముక్కుతో పట్టుకుని గుటుక్కుమనిపిస్తోంది.

"కొంగబావా... కొంగబావా నా ముక్కులో ముల్లిరిగింది. కాస్త ముక్కుతో తీసిపెట్టవా? పుణ్యముంటుంది" అంది బతిమాలుతూ.

"ఈ చేపలు భలే తెలివి మీరాయి. పొద్దుట్నించి అవస్థపడుతున్నా, ఒక్కటన్నా దొరికి చావలే. ఆకలితో అల్లాడుతున్నాను కానీ, నా కిప్పుడు తీరిక లేదు. ఎవర్నన్నా చూసుకోపో..." అంది నీళ్ళలో ముక్కును ముంచుతూ.

అక్కడించి లేచి వేప చెట్టు మీద వాలింది పిచ్చుక. పక్కనే కాకి ఒహటే కావుకావుమని అరుస్తోంది. ముక్కు బారుగానే ఉంది గదా అనుకుని ఇంకాస్త దగ్గరకు వెళ్ళింది.

'అన్నా నీ ముక్కుతో నాముక్కులో ఇరిగిన ముల్లును కాస్త తీసి పెట్టవా? తెగనొప్పి పెడుతుంది" అంది పిచ్చుక.

"మీ పిచ్చుకల జాతంటేనే నాకు తెగ కోపం. భూమ్మీద నాలుగు గింజలు కనబడితే తిని, ఆకలి తీర్చుకుందామనుకుంటామా? ఎక్కడ్నించి వస్తారో, మందలుగా వచ్చి వాలిపోతారు. మరో పిట్టకు గింజ మిగల్నివ్వరు. మీ వల్ల మా కాకులకు మేత దొరక్క, దేశమంతా తిరిగి పొట్టపోసుకోవల్సి వస్తోంది. వెళ్ళు.... వెళ్లు..." అంది చిటపటలాడుతూ..

అక్కడ్నించి లేచి మర్రి చెట్టుమీద కూర్చుని, ముక్కుకు పట్టిన అవస్థను తలుచుకుంటూ, దుఃఖపడ సాగింది. అక్కడికో ఊరపిచ్చుక వచ్చి, పక్కనే వాలింది.

"ఎందుకు ఏడుస్తున్నావు తమ్ముడూ?" అనడిగింది ప్రేమగా. పొద్దుట్నుంచి జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పి, ముక్కులో ముల్లు ఎవరూ తీయడం లేదు. మేత తినేలా లేదు. నొప్పిగా వుంది అంది.

'ఓస్ ఈ మాత్రానికే బాధపడుతున్నావా? నేను తీస్తాలే, ఏడవకు" అంది.

"నీ ముక్కు పొడవుగా లేదు గదా? పొట్టి ముక్కుతో ఎలా తీస్తావు?" అంది సందేహంగా.

"ముల్లు తీయడానికి, మనసుండాలేగానీ ముక్కుతో పనిలేదు. నా చిట్టి ముక్కుతో తీస్తాను గదా" అని పిచ్చుక ముక్కులో ఇరికిన ముల్లును ఒడుపుగా తన ముక్కుతో లాగేసింది. పిచ్చుక, ఆనందంతో దానికి కృతజ్ఞతలు చెప్పుకుంది. మంచి పని చేయడానికి మంచి మనసుండాలేకానీ, శరీరంతో సంబంధంలేదు అని అర్థం చేసుకుంది. మూరెడు ముక్కున్నా, బారెడు కాళ్లున్నా, బాన లాంటి పొట్టున్నా, చేటల్లాంటి రెక్కలున్నా మంచి మనసు లేకుంటే – ఆ పక్షి బతుకు బండి సున్న.

- పుప్పాల కృష్ణమూర్తి



కనిపెట్టారా...

ఈ పూల పేర్లలో అండర్‌లైన్ చేసిన అక్షరాలను ఒక చోట చేర్చితే మరో కొత్త పదం వస్తుంది. ఆ పదమేంటో తెలియాలంటే అక్షరాలను కలపండి.

జవాబు : candy

నీడ ఏది?



ఇక్కడ ఏడు ప్రాణులు, వాటి నీడలు ఉన్నాయి. అయితే నీడలు అడ్డంగా, తల కిందులుగా కూడా ఉన్నాయి. ఏ ప్రాణి నీడ ఏదో గుర్తుపట్టండి.

ఎన్నున్నాయ్?

ఈ ఫొటోలో ఎన్ని వృత్తాలున్నాయో చెప్పండి.



రంగులు వేద్దాం

తేడాలు దొరికాయా?

ఈ రెండు బొమ్మల్ని చూస్తుంటే ఒకేలా కనిపిస్తున్నాయి కదూ! కానీ ఈ బొమ్మలు గీసిన ఆర్టిస్టు చాలా తెలివిగా, మీ మెదడుకు పదును పెట్టడానికి వాటి మధ్య ఐదు తేడాలు పెట్టాడు. అవి వెతకండి.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి,** ఫోన్: **91776 18708**

(గతవారం తరువాయి)

'యూదు సమస్యలో మతాన్ని ఒక ఆధ్యాత్మిక విషయంగా కాక, సామాజిక, రాజకీయ అంశంగా పరిశీలించాడు మార్క్స్. పందొమ్మిదవ శతాబ్ది ప్రథమార్థంలో, జర్మనీలోని యూదులు ఎక్కువగా వాణిజ్య, ఆర్థిక రంగాలలో తమ కార్యకలాపాలు కొనసాగించారు. ప్రత్యేకంగా చట్టమేమీ లేకపోయినా, ప్రభుత్వం వాళ్లకు ఈ రంగాలలో మాత్రమే అనుమతిచ్చింది. ఈ కారణంగానే, సమాజం వాళ్లను చూసే తీరు కూడా ప్రభావితమైంది.

ప్రస్తుత (1840) జర్మనీలో మతం పోషిస్తున్న పాత్ర ఏమిటి? రాజకీయాల్లో క్రిస్టియన్లూ, వాణిజ్య, ఆర్థిక రంగాలలో యూదులు బలంగా ఉన్నారు. మరి, మతం నుండి స్వేచ్ఛ అంటే ఏమిటి? యూదులకు మతం నుండి స్వేచ్ఛను కల్పిస్తే – అంటే ఆర్థిక రంగం నుండి దూరం చేస్తే – రాజ్య నిర్వహణకే ప్రమాదం రావచ్చు. ఇది జర్మనీలో సామాజిక విప్లవానికి దారితీస్తుంది. రాజ్యాన్ని నిలబెట్టిన ఒక స్తంభం – ఆర్థిక రంగం – కూలిపోతే ప్రభుత్వమే కూలిపోతుంది. అదే మార్క్స్‌కు కావలసింది.

రూగ్ పత్రిక ఆగిపోయేనాటికి జెన్నీ ఏడు నెలల గర్భవతి. మార్క్స్ ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. ఇద్దరికీ పత్రిక రాజకీయ స్వభావం గురించి విభేదాలున్నాయి. ఇప్పుడు ఇద్దరూ కలిసి హెర్వీగ్‌తో యుద్ధం చెయ్యవలసి వచ్చింది. రూగ్‌కు అతడి ప్రవర్తన అస్సలు నచ్చలేదు –'పారిస్ తళుకు బెళుకులు అతణ్ణి మైకంలో ముంచాయి. డబ్బున్న వాళ్ల ఇళ్లలో విదూషకుడిగా మారాడు. పడతుల అందచందాలకు లొంగిపోయాడు – హెర్వీగ్' కౌంటెస్ డాగూల్ట్‌తో అతడి సంబంధాన్ని కూడా తప్పుబట్టాడు రూగ్. అతడు చెప్పిందంతా ప్రశాంతంగా విని, ఇంటికెళ్లి, హెర్వీగ్ జీనియస్‌ని సమర్థిస్తూ, రూగ్‌ది సంకుచిత స్వభావమంటూ ఓ లేఖ రాశాడు మార్క్స్. నిజానికి ఈ పొట్లాటలన్నింటికీ అసలు కారణం డబ్బు అయి ఉంటుంది. మార్క్స్ నెల జీతం బదులు, పత్రిక కాపీలిస్తానన్నాడు రూగ్. మార్కెట్లో అమ్ముడుపోని పత్రిక కాపీలు ఎవరైనా ఏం చేసుకుంటారు! ఆ సమయంలో మార్క్స్‌కు డబ్బు అత్యవసరం. రూగ్ దగ్గర నిజంగా డబ్బు లేదా అంటే, కొద్దిరోజుల క్రితమే రైల్వేస్టాక్స్‌లో లాభం కూడా వచ్చింది.

మార్క్స్, ఇక తాను రోడ్డున పడతానేమో అనుకుంటున్న సమయంలో, జార్జి యుంగ్, కొలోన్‌లో వుంటున్న రైనిష్ జైటుంగ్ స్టాక్ హోల్డర్లు (వాటాదార్లు) రూగ్ పత్రిక ద్వారా వచ్చే ఆదాయానికి రెట్టింపు మొత్తం పంపారు. తనకు బదులు మరొకరు మార్క్స్‌కు సహాయం చెయ్యటం రూగ్‌కు కోపం తెప్పించింది. మార్క్స్ దంపతులు షాపింగ్ మీద బాగా తగలేస్తున్నారంటూ ఫ్రోబెక్‌కు ఫిర్యాదు చేశాడు రూగ్.

"మార్క్స్ కోరికలకు అంతు లేదు. చూసిందంతా కావాలంటాడు" మరోసారి, "ఇతడు ఓ వింత మనిషి. రచయితగా గొప్పవాడే. కాని విలేకరిగా పనికిరాడు. విపరీతంగా చదువుతాడు. కష్టపడి పనిచేస్తాడు. కాని ప్రారంభించిన ఏ పనీ ముగించడు. పుస్తకాల సముద్రంలో ఈదులాడటం అతడికిష్టం". అని కూడా ఫిర్యాదు చేశాడు. మార్క్స్ మాత్రం వూరుకుంటాడా!' ఎందుకూ కొరగాని మూర్ఖుడు' అంటూ రూగ్‌ను ఎద్దేవా చేశాడు.

మార్క్స్ మొదటి సంతానం మే 1, 1844 నాడు జన్మించింది. తనకు లిటిల్ జెన్నీ లేక జెన్నీ చెన్ అని నామకరణం చేశారు. పేరు తల్లిదైనా అంతా తండ్రి పోలికే. అవే నల్ల కళ్లు. దట్టమైన జుత్తు. పిల్లల్ని పెంచటమెలాగో ఇద్దరికీ తెలియదు. జెన్నీ పెరిగిన ఇంట్లో కావలసినంత మంది మనుషులుండేవారు. పిల్లలు పుట్టగానే ఆలనాపాలనా అంతా వాళ్లే చూసుకునేవారు. ఏడుగురు సోదరీ సోదరులున్నా మార్క్స్ ఒంటరి పిల్లడిగానే పెరిగాడు. కుటుంబంతో ఎప్పుడూ పెద్దగా సంబంధాలు లేవు. సాయంత్రం అయిదు గంటలకు లేచి, తెల్లారి అయిందింటిదాకా కేఫ్‌లలో, మద్యశాలలో కాలక్షేపం చేసేవాళ్ల బొహిమియన్ మిత్రుల వల్ల ఉపయోగం లేదు. అందువల్ల, దంపతులిద్దరూ కలిసి, తమకు తెలిసిన పద్ధతిలో పెంచాలనుకున్నారు. కానీ ఒకనాడు చంటిపిల్లకు తీవ్రంగా జబ్బు చేసింది.

అప్పుడు, అనూహ్యంగా ఓ వ్యక్తి ఆదుకున్నాడు. ఆయనే హైన్రిష్ హైన్ – నలభై ఆరేళ్ల కవి. ఆయనకే ఆరోగ్యం బాగోలేదు. పాక్షికమైన పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడు. స్వయంగా పిల్లల్ని కని పెంచిన అనుభవమూ లేదు. అయినా, అవస్థపడుతూ, మార్క్స్ అపార్ట్‌మెంట్ మెట్లెక్కి వచ్చి పిల్లకు అండగా నిల్చాడు. మొదట వేడినీళ్లతో స్నానం చేయించాడు. జెన్నీచెన్ కోలుకుంది కాని, తల్లిదండ్రులు మాత్రం షాక్ నుండి కోలుకోలేదు. 'జెన్నీ, కూతుర్ని ట్రియర్‌కు తీసుకుపోవాలి. అక్కడ ఆమె తల్లి కొన్నాళ్లపాటు శిశువును కాపాడుతుంది' ఇది వాళ్లు తీసుకున్న నిర్ణయం.

చంటిపిల్లను తీసుకుని రైన్‌లాండ్‌కు బయల్దేరింది జెన్నీ. అది జూన్ మాసం. పారిస్‌లో కార్ల్ ఒక్కడే ఉంటాడు. పుట్టింటికైతే బయల్దేరింది గాని జెన్నీ మనసు ఆందోళనగానే వుంది. పెళ్లై ఇంకా ఏడాది కూడా కాలేదు. ఒంటరిగా ఉన్న కార్ల్‌ను పారిస్ నగర అందాలు రెచ్చగొట్టకుండా ఉంటాయా! కోరికలు కలగాలే గాని, అక్కడ అవి తీరటం చాలా సులభం.

జెన్నీ దిగులు పడవలసిన అవసరం లేదు. ఆమె లేని సమయంలో మార్క్స్ కొత్త లోకాన్ని అన్వేషించాడు. అయితే అది పడచు అందగత్తెల లోకం కాదు. ఆయన అన్వేషించింది ఎవ్వరికీ ఓ పట్టాన అర్థంకాని ఆర్థికలోక రహస్యాలను.

పారిస్, 1844

ఉద్యోగం లేకపోవటం కూడా ఒక వరమే. ఇప్పుడు మళ్లీ క్లాసు రూముల్లో కూర్చుని పాఠాలు నేర్చుకోవచ్చు. అయితే ఇప్పుడు గాస్ లైట్ల వెలుగులో, దట్టమైన సిగార్ పొగలతో నిండిన కేఫ్‌లు, సెల్లార్లు, చిన్న చిన్న ఆఫీసు గదులే క్లాస్ రూంలు. ఇక్కడ ఉపన్యాసాలుండవు. చర్చలు మాత్రమే. అందరూ బిగ్గరగా గొంతు చించుకుని అరుస్తారు. కొన్నిసార్లు ఒకరి మాటలు ఒకరికి వినిపించవు.

కొత్తవాళ్లు ప్రవేశించి, ఏం జరుగుతుందో అర్థంగాక ఎగాదిగా చూస్తారు. అన్ని దేశాల వాళ్లు, అన్ని భాషల్లో సోషలిజం, కమ్యూనిజం, నేషనలిజం, లిబరలిజం, డెమోక్రసీల గురించి మాట్లాడతారు. ప్రభుత్వాలను ఉన్నపళంగా పడగొట్టేలా, నూతన సమాజాన్ని నిర్మించటమంటే ప్రస్తుత సమాజాన్ని సమూలంగా ధ్వంసం చెయ్యటమా? అధికార వర్గాలకు అర్జీలు పెట్టుకుని మౌలిక హక్కులు సాధించుకోవటం సాధ్యమా? – ఇలా ఒకటేమిటి! అన్ని రకాల అభిప్రాయాలకూ సమర్థకులున్నారు. వ్యతిరేకించిన వాళ్లూ వున్నారు. రాచరిక వ్యవస్థ మారాలని ఒకరంటారు. లేదు.. లేదు... దాన్ని తక్షణం నిర్మూలించాలంటారు మరికొందరు. అధికారం బూర్జువా వర్గాలు, పారిశ్రామికవేత్తల చేతిలో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం. అప్పుడే ఉత్పత్తి పెరుగుతుంది. మార్కెట్లు విస్తరిస్తే వినియోగ వస్తువులు అందరికీ అందుబాటులోకి వస్తాయి అన్నది ఒక వాదన. లేదు... ఈ అభివృద్ధే పేదల పాలిట శాపం. పారిశ్రామికీకరణను నడిపే ఇంధనం అభివృద్ధి కాదు. దురాశ, లాభాల వేట వాళ్ల గమ్యం. సంపద పెంచుకునే క్రమంలో అది సృష్టించిన, సృష్టిస్తున్న కార్మికులనేవాళ్లు తమ ధన దేవతకు బలిస్తున్నారు. పారిస్‌లోని క్లాస్ రూముల్లో మార్క్స్ విన్న పాఠాలివి.

మొత్తంమీద ప్రభుత్వాల స్వరూప, స్వభావాలు మారవలసిన తక్షణ అవసరం అందరూ గుర్తించారు. సమాజంలో మార్పొచ్చింది. ఇప్పుడు రాజులు, రారాజులు తమ వంధిమాగధులతో, భట్రాజులతో, చుట్టూ చేరి భజన చేసే గుంట నక్కలతో బుడబుక్కల వాళ్లలాగ, పిట్టల దొరలలాగ కనిపిస్తున్నారు. రాజరికాలకిక కాలం చెల్లింది. ఆ వ్యవస్థ ఇక కొనసాగే అవకాశం లేదు. అయినప్పటికీ, సామాజిక, ఆర్థిక ప్రగతికి వాళ్లింకా అడ్డు తగులుతున్నారు. అందరికీ ఈ విషయం గురించి ఏకాభిప్రాయం కుదిరినా, రాబోయే కొత్త వ్యవస్థ ఎలా ఉండాలో మాత్రం తేల్చుకోలేకపోయారు.

జెన్నీ ట్రియర్‌కు వెళ్లటానికి ముందు మార్చిలో మార్క్స్ ఒక విందుకు హాజరయ్యాడు. అక్కడ అంశాలన్నీ చర్చించారు. తరువాతి ముప్పై సంవత్సరాలలో యూరోపియన్ విప్లవ రాజకీయాలలో ముఖ్య పాత్రలు పోషించబోయే వాళ్లలో చాలామంది వున్నారక్కడ. మార్క్స్‌కు సంబంధించినంత వరకూ అందులోని ముఖ్యవక్తలిద్దరు : ఒకరు మిహైల్ బకూనిన్. మరొకరు లూయీ బ్లాంక్.

రష్యన్ కౌంట్ కుమారుడు బకూనిన్. తండ్రికున్న చాలా పెద్ద ఎస్టేట్‌కు, 500 అర్థబానిసలకు యజమాని. మిలిటరీ ట్రెయినింగ్ పూర్తిచేసి, సైన్యంలో చేరటం ఇష్టంలేక 1840లో బెర్లిన్ చేరుకున్నాడు బకూనిన్. అక్కడే, యంగ్ హెగెలియన్‌లలోని రష్యన్ బృందంతో పరిచయం పెరిగింది. అలాంటి ఒక యంగ్ హెగెలియన్, తరువాతి కాలంలోని ప్రముఖ రష్యన్ నవలా రచయిత ఇవాన్ టుర్గెనీవ్. ('నిహిలిజం' అనే మాటను తొలిసారి వాడింది ఈయనే.) బకూనిన్‌కు టుర్గెనీవ్‌తో మంచి దోస్తీ కుదిరింది.

ఆ తర్వాత, దేశదేశాలు తిరిగి, విప్లవకారుడిగా పేరు గడించి పారిస్ చేరుకున్నాడు బకూనిన్. మార్క్స్ కన్నా నాలుగేళ్లు పెద్ద. అయినా మేధోపరంగా మార్క్స్ తనకన్నా ఎంతో వున్నతుడని స్వయంగా ప్రకటించాడు. అయితే, ఇద్దరి మధ్యా ఎప్పుడూ సఖ్యత లేదు. అభిప్రాయాలలో, అవగాహనలో కూడా చాలా వ్యత్యాసం ఉంది. 'అతడు నన్ను సెంటిమెంటల్ అయిడియలిస్ట్ అన్నాడు. 'నేను అతణ్ణి అహంభావి, నమ్మక ద్రోహి' అన్నాను అని రాసుకున్నాడు బకూనిన్.

1844లో లూయీ బ్లాంక్ వయసు ముప్పై మూడు. అప్పటికే అతడు ఫ్రాన్సులోని ప్రముఖ సోషలిస్టులలో ఒకడు. సన్నగా, బక్కపలచగా ఉంటాడు. ప్రజాస్వామిక ప్రభుత్వం కార్మికుల స్వాధీనంలో ఉండాలంటూ 1840లో ఒక పుస్తకం ప్రచురించాడు. లూయీ ఫిలిప్ దుష్టపాలనను వివరించిన మరో పుస్తకం 'హిస్టరీ ఆఫ్ టెన్ ఇయర్స్' కూడా ఆయన రచనే. 1843లో ఒక పత్రికకు సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరించాడు. 'రాజరికం అంతరించాలి, అందరికీ ఓటుహక్కు, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం కావాలి' అని ప్రచారం చేశాడు.

బ్లాంక్‌కు కూడా, బకూనిన్ లాగానే మార్క్స్‌తో ఎప్పుడూ పొసగలేదు. వీళ్లు మొదటిసారి విందులో కలిసేనాటికి అందర్నీ ఒక గొడుగు కిందకి తేగల అంతర్జాతీయ సంస్థ ఏదీ లేదు. ఎవరి ప్రాంతీయ సమస్యలు వారికి కావటం కూడా ఒక కారణం కావచ్చు. అయినప్పటికీ, ఇంచుమించు అన్ని దేశాల ఉదారవాదులూ జన్మత్త అధికారం సంక్రమించే రాజరికాలు కాక, ప్రజలెన్నుకునే ప్రజాస్వామ్యాలు కావాలని వాదించారు. వాక్‌స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ, ఆస్తిహక్కులు వాళ్ల డిమాండ్లు. ఒకవేళ రాజు ఉన్నప్పటికీ, రాజ్యాంగం కూడా ఉండక తప్పదన్నారు. రాడికల్స్ కూడా ఉదారవాదులే. కాని వీళ్లు రాజరికాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. సామాజిక సంస్కరణలతోపాటు, సార్వత్రిక ఓటు హక్కు కూడా కావాలన్నారు. జాతీయవాదులు కూడా ఉదారవాదులే. కాని వాళ్లకు భాష, సంస్కృతి, కళలు ముఖ్యం. సోషలిస్టులు ప్రైవేటు ఆస్తి ఉండకూడదన్నారు' వారసత్వ ఆస్తిహక్కు మిషతో బలహీనులు, ఏ పనీ చెయ్యక నిరర్థకంగా గడిపేవాళ్లు సంపన్నులవుతున్నారు. సంపద సృష్టికర్తలు వాళ్లను పోషిస్తున్నారు" అయితే, అప్పటికి అందరివాదనలూ సిద్ధాంతాలకే పరిమితమైనాయి. అన్నీ చర్చిస్తున్నారే తప్ప ఎవరికీ పెద్దగా ప్రజల మద్దతు లేదు. సైన్యం మద్దతు అసలే లేదు. దీనికి కారణం తెలుసుకోవటం సులభమే. కార్మికవర్గమే విప్లవ సైన్యమన్నాడు మార్క్స్. కాని కార్మికులకు మధ్యతరగతి సంస్కరణవాదులన్నా, వాళ్లు ప్రచారం చేస్తున్న విప్లవ భావజాలం పట్లా నమ్మకం లేదు. వీళ్లంతా మానవాళి విముక్తి అభ్యుదయం అంటున్నారే తప్ప వ్యక్తుల భౌతిక అవసరాల గురించి మాట్లాడటం లేదు. ఇలా, ఎవరెన్ని 'ఇజం'ల గురించి మాట్లాడినా ఎవరూ సమస్యను సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారనుకున్నాడు మార్క్స్. ఈ విషయాన్ని కూలంకషంగా అవగాహన చేసుకుంటే తప్ప 'మార్పు' సాధ్యం కాదు. అదేదో తెలుసుకోవలసిందే అంటూ తన అన్వేషణ ప్రారంభించాడు.



పారిస్‌లో వుంటున్న ఇద్దరు జర్మన్ల పరిచయం ఇందుకు కొంత దోహదం చేసింది. ఆగస్ట్ హెర్మన్ ఎవర్‌బెక్, జెర్మేన్ మారర్‌లు (రహస్య బృందం) లీగ్ ఆఫ్ జస్ట్ సభ్యులు. పారిస్‌లో వుంటున్న కార్మికవర్గ జర్మన్ కాందిశీకులతో 1836లో ఏర్పాటైందీ లీగ్. వీళ్లు కొంత బహిరంగ ప్రచారమూ చేస్తారు. మరికొన్ని రహస్య కార్యకలాపాలూ కొనసాగిస్తారు. ఫ్రెంచి కమ్యూనిస్టులతో ప్రేరణ పొందారు. సమాజాన్ని సమూలంగా మార్చాలంటే ప్రైవేటు ఆస్తిని రద్దు చెయ్యటం తప్పనిసరని నమ్మారు. వీళ్ల సమావేశాలకూ ఫ్రెంచి కమ్యూనిస్టుల సమావేశాలకూ హాజరైన మార్క్స్ మేధావుల పడక్కుర్చీ చర్చలకన్నా వీళ్ల నిబద్ధతలో నిజాయితీ వుందని గ్రహించాడు. 'మానవ సౌభ్రాతృత్వమనేది కేవలం మాటలకే పరిమితం కాలేదు. అది వాళ్లకు జీవిత సత్యం' అని రాసుకున్నాడు.'చాలీచాలని జీతాలతో పనిచేసిన వాళ్ల మొహాల్లో పరాయీకరణ స్పష్టంగా కనిపించింది. కాయ కష్టం చేసింది వీళ్లు. లాభపడింది ఫ్యాక్టరీ యజమానులు".

ఈ సమావేశాలతో ప్రేరణ పొంది, ఫ్రెంచి ఇంగ్లీష్ ఆర్థిక శాస్త్రవేత్తల గ్రంథాలు అధ్యయనం చెయ్యటం ప్రారంభించాడు త్వరలోనే మార్క్స్ నోట్ బుక్కులన్నీ నిండిపోయాయి. అసంపూర్తిగా ఉన్న నోటుబుక్కులే మనకు తెలిసిన 1844 Manuscripts లేదా "Economic and philosophical Manuscripts". మార్క్స్ ఆ తర్వాత, జీవితాంతం కొనసాగించిన కృషికి ప్రాతిపదిక ఈ నోట్‌బుక్స్.

(సశేషం)

■ **కథ : భావన**

"అయిదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పక వేయించండి".

రేడియోలో విన్పించిన మాటలే మళ్ళీ మళ్ళీ చెవుల్లో రింగుమంటున్నాయి. నాలాంటి దురదృష్టం ఎవరికీ పట్టద్దనే, వైద్యలోకం ఈ జబ్బుకు మందు కనుక్కుంది... కనుక్కోవడం వరకైతే వారు చేయగలరు. కానీ ఇంటింటా తిరిగి, పిల్లలని కాపాడలేరు కదా... ఆ బాధ్యత మోయాల్సింది తల్లిదండ్రులు కాదంటారా?

కానీ మా వాళ్ళు ఏం చేశారు? దేనికీ పట్టనట్లు వదిలేశారు. ఆ... డాక్టర్లకేం అలాగే చెప్తారు. వాళ్ళది 'చాదస్తం' అంటూ కొట్టిపడేశారు.   వాళ్ళు చేసిన ఆ చిన్ని నిర్లక్ష్యం నన్ను కుంటిదాన్ని చేసింది...

వైకల్యం

కాలుసరిగా లేక సరిగ్గా నడవలేక నేను కుంటిదాన్ని అయ్యానని మీరనుకుంటే మీది పొరబాటే... సరిగ్గా ఆలోచించలేని మెదడు, మంచీ చెడు ఏవిటో విశ్లేషించలేని నా అజ్ఞానం నా జీవిత నడకని అస్తవ్యస్తం చేశాయి. అప్పుడు కుంటుపడింది నా జీవితం.

దీనికి, కాలు వంకరే కానీ జీవితం మాత్రం సవ్యంగా బ్రహ్మాండంగా వుంటుందని మురిసిపోయేది మా అమ్మ... గవర్నమెంటు పుణ్యమా అని అన్నింటిలో రిజర్వేషన్లు... ఫీజులుకూడా మాఫీయే... ఇక మా అమ్మాయి చదువుకు ఢోకా లేదు. ఏ ప్రభుత్వ ఉద్యోగమో వచ్చిందా ఇక దీనికి పెళ్ళి కాదన్న దిగులుండదు... ఊపిరి పీల్చుకునేవాడు మా నాన్న.

చదువుకునేది జ్ఞానాన్ని పెంచుకోవడం కోసం కదా? ప్రభుత్వం నాకిచ్చే పథకాలు, ఇచ్చిన పతకాలు ఇవన్నీ నాలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి కాదా? నా అమ్మా నాన్నలు చేసిన చిన్న తప్పు వల్ల నా జీవితం బలి కాకూడదన్న ఆలోచనతో కాదా?

కాదని తెలిపోయింది... ఫ్రీ చదువు... సులువుగా వచ్చిన ఉద్యోగం తెచ్చుకోవడానికి ఉపయోగపడ్డ నా హెల్త్ సర్టిఫికెట్. మొగుణ్ణి కొనుక్కోవడానికి మాత్రం చాలా సొమ్మే ఖర్చు చేసింది. పైగా పెళ్ళినాట ముట్టజెప్పిన 'మొత్తం' కేవలం 'ఫిక్స్‌డ్ డిపాజిట్' మాత్రమే. అది సెక్యూరిటీ కోసం అట (ష్ ఎవరికి? అని అడగకండి). ఆ తర్వాత నెలనెలా తెచ్చే జీతం ఓ రికరింగ్ డిపాజిట్...

ఇవే కాదు, స్వల్పరుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఇంటిరుణాలు... నా పేరు మీద అన్నీ చవకే... అందుకే నా జీవితం ఒకప్పుడు రోగగ్రస్తం... ఇప్పుడు ఋణగ్రస్తం.

పెళ్ళిచూపుల్లో నువ్వు నచ్చావని పెళ్ళి చేసుకున్నాననుకున్నావా? వరుస పదిరాత్రులు తన ఆకలి తీర్చుకున్న తర్వాత అతనడిగిన ప్రశ్న అది... మౌనంగా వుండడం ఆనాడే మొదలైంది నాకు. ఎన్నో వేదికల మీద 'ఆత్మస్థైర్యం' పెంపొందించుకోవడంపై ఉపన్యాసాలిచ్చిన నా గొంతు మూగబోవడానికి నాంది పలికిన క్షణం అది. మళ్ళీ తనే సమాధానం కూడా చెప్పాడు... ఊహు నన్ను సమాధానపర్చాడు... నీ స్యాలరీ స్లిప్స్, నీకు ప్రభుత్వ పరంగా వచ్చే బెనిఫిట్‌లు... ఆహా! గవర్నమెంటు ఉద్యోగంతో వచ్చే సెక్యూరిటీయే వరు... అందుకే నిన్ను ఓ.కె. చేసింది.

★★★

సంపాయించి పెట్టే మెషీన్‌వి! నీకు కోరికలేంటి? అలాంటి ఆశలేమన్నా వుంటే తుంచేయ్... నీ జీవితానికి ఓ తోవ దొరికిందనుకో. పెళ్ళి కాకుండా, కన్యగానే జీవితాంతం పడి వుండనందుకు సంతోషించు. పేరుకు ముందు 'శ్రీమతి' చేరాలంటే అంత సులువనుకున్నావా? ఏదో నేను దయ తలచాను కాబట్టి సరిపోయింది. అక్కడితో ఆగు. అంతే కానీ నా జీవితం, నా ఖర్చులు, నా అలవాట్లను గురించి ప్రశ్నించావో ఇప్పుడున్న 'కర్ర'కు బదులు నువ్వో 'వీల్‌చైర్' కొనుక్కోవాల్సి వస్తుంది జాగ్రత్త! బెదిరింపు ధ్వనించింది ఆ స్వరంలో...!

అసలు సీతా, లత, రోజాల పెళ్ళికెళ్ళినపుడు అక్కడ కట్నంతో పాటు వరుడికి ఇచ్చే సామానంతా వేదికపై ఓ పక్క డిస్‌ప్లేగా వుంచారు. ఆ ముగ్గురి పెళ్ళిళ్ళలోనూ అత్తవారు ఇచ్చిన అన్ని వస్తువుల్లోనూ ఆ మోటర్‌బైకులు నన్నెంత ఆకట్టుకున్నాయో చెప్పలేను.

నా పెళ్ళికీ మోటార్‌బైక్ ఇస్తే బావుంటుంది కదా అనుకునేదాన్ని. ఆ సమయమూ వచ్చింది... "పెళ్ళికొడుకు కాస్త ఎక్కువ తూగేలా వున్నాడు ఏం చేద్దాం? నాన్న గొంతులో కాస్త ఆందోళన ధ్వనించింది. బైకుల ఫ్యాషన్

పోయింది కాబట్టి లాంఛనాల్లో కారు ఇమ్మంటున్నాడు". మెల్లిగా అసలు విషయం చెప్పారు. పోనీలెండి! ఇక్కడిదాక వచ్చాక, ఇప్పుడు వెనక్కి తగ్గటం ఎందుకు? అయినా అమ్మాయి ఉద్యోగం చేసి దాచుకున్న సొమ్ము కూడా వుంది... దాన్ని సుఖంగా కారులో తిప్పాలని అతను ఆశ పడుతుంటే మనం సంతోషించాలి కానీ... అమ్మ తీర్మానం చేసింది.

అయిపోయింది! మోటార్ బైకు మోజు కాస్త తీరకుండానే పోతోంది. నా కల కలగానే మిగిలిపోతుంది. మూడు గిర్రల స్కూటర్ నుంచి ప్రమోషన్ కోరాను కదా భగవాన్! 3కు బదులు నాలుగు చక్రాల కారును ఇచ్చావా? కాదు కాదు... నేను అడిగిన ప్రమోషన్ ఇది కాదు... ఈ కారు నన్ను సుఖపెట్టలేస్తుందా? లోలోపల యవ్వనంగా వున్న మనసు, ఇంకా అణిగిమణిగి వుండలేని మనసు నా మగాడైన మొగుడి చుట్టూ చేతులుంచి "మేఘాలే తాకింది హాయ్ హాయ్ లెస్సా" అని గొంతెత్తి పాడదామనుకుంది. అది అత్యాశేనంటావా? రెండు చక్రాల బండిలో ఇంకేదో కిక్ వుంది అని నా మది అనుకుంటోంది కాదంటారా?

ఇలా పరిపరివిధాల ఆలోచనలతో నన్ను నేను ఓదార్చుకున్న కొన్ని సందర్భాలలో ఈ కారు విషయం కూడా చేరిపోయింది. పెళ్ళి పందిట్లో నాతో పాటూ కారుకూ ముస్తాబు చేసి పెళ్ళి చేశారు. ఇద్దర్నీ ఒక్కడికే కట్టబెట్టారు మా వాళ్లు. నేను పెళ్ళికూతుర్ని కదా అందుకని వెనుక సీట్లో కూచోబెట్టారు నన్నానాడు.

అప్పట్నించీ, ఇప్పటివరకు 'ముందుసీటు' నేనెరుగను అని చెప్పాలంటే సిగ్గనిపిస్తుంది నాకు... కానీ ఈ కారు అధ్యాయం తలుచుకున్నప్పుడల్లా ఇంత బాధలోనూ ఊపిరి తీసుకుంటూ వుంటాను. ఎంతోమందిని కవ్వించి, నవ్వించిన ముందుసీట్లో నేను కూచోలేదులే అని... అయితే, నేను కూర్చునే వెనకసీటు కూడా ఎన్నోసార్లు ఎంగిలయిందని తెలిసి కూడా ఎలా నన్ను నేను ఓదార్చుకోవడం?

అంతేనా? నా చిన్నప్పుడు స్టీలు గిన్నెలపై, ఇత్తడి తప్పాలాలపై నాన్న పేరు కొట్టిస్తున్న అమ్మని చూసి అమ్మా కనీసం వంటింటి సామానైనా నీ సొంతం కాకూడదా? అని ప్రశ్నించేదాన్ని. మరి ఇప్పుడు మేం కొన్న కారు పైన ఎక్కడా నా ఆనవాళ్ళు వుండవు. కేవలం లోన్ అప్లికేషన్ మినహా... దేన్నో సొంతం చేసుకోవాలి అనుకుంటూ మనల్ని మనం పోగొట్టుకోవడమేనా జీవితం!

★★★

ఆ ఆదివారం మధ్యాహ్నం కలిసి భోజనాలు అయ్యాయి అనిపించి ఎవరికి వారుగా విడిపోయి నేను మ్యాగజిన్‌లో పేజీలు తిప్పుతుంటే అతను టీవీలో చానల్స్ రిమోట్ కంట్రోల్‌తో మారుస్తూ ఇంకేదో వెతుకుతున్నాడు. పేరుకు నేను పుస్తకం వంక చూస్తున్నాను. మస్తిష్కంలో అనేకానేక ఆలోచనలు... అడ్వర్టయిజ్‌మెంట్స్ ఎంత బాగా డిజైన్ చేస్తారో! 2 కాఫీ కప్పుల పక్కకి మరో బుజ్జి కప్పు వచ్చి చేరడం, రెండు చాక్లెట్ బార్‌లతో మరో బుల్లి టాఫీ చూపడం... కానీ ఇది నిజంగా కష్టమే... ఏ అనుభూతులూ లేని దాంపత్యంలో ఏ మాట మాట్లాడాలన్నా తడబాటే కదూ... ఎలా చెప్పడం? అయినా తప్పదు... ఏమంటాడో! ఇప్పటికయినా మా మధ్యన నిశ్శబ్దం చీల్చుకుని ఓ చిన్ని కేరింత నా జీవితం లోకి వచ్చేనా? గతాన్ని మరిచి కొత్త జీవితాన్ని మొదలెట్టడానికి ఇదో శుభతరుణమవుతుందా? నాలో తెలీని ఆశ చిగుళ్ళు తొడుగుతోంది. అంతలోనే ఏదో తెలీని భయం, బెరుకు నన్ను ఆవహిస్తోంది... ఇలాగే వుంటుందా? భార్యాభర్తల మధ్యన ఈ విషయంలోనూ ఘర్షణలుంటాయా? ఎటూ ఆలోచించలేకపోతున్నా... చెప్పేయాలి? ఈ సంతోషాన్ని (?) తనతో పంచుకుంటే బావుణ్ణు.. ఇదే సరైన సమయం అన్పించింది... ఈ క్షణం వదిలానా, ఇక సాయంత్రం అయిందా... ఈ మనిషికి ఇల్లే గుర్తురాదు. అందుకే ఈ అవకాశాన్ని వదులుకోవద్దనుకున్నా. ఒంట్లోని ధైర్యాన్ని అంతా పోగేసి మెల్లిగా అన్నాను– "మీకు ఓ విషయం చెప్పాలి" అని...

ఊ కానీయ్... ఎలాంటి ఆసక్తి లేకుండానే ఆజ్ఞ అయింది...

"నిన్నే డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. పాజిటివ్ అని చెప్పింది డాక్టర్... తొలిరోజులు కాబట్టి కాస్త జాగ్రత్తగా ఉండమంది. ఓ నెలరోజులు మెడికల్ లీవ్ అప్లై చేద్దాం అనుకుంటున్నా..." చెప్పవల్సింది చెప్పాను అన్నట్టు ఊపిరి పీల్చాను నేను. ఓ క్షణం నిశ్శబ్దం... అప్పుడు అర్థమయ్యిందేమో... "సరే చూద్దాం" అంటూ ఒక్క ఉదుటున అక్కణ్నించి లేచి వెళ్ళిపోయాడు. "చూద్దాం" అంటే ఏంటో? సెలవు గురించి కాబోలు... ప్రతీదాన్ని నెగెటివ్‌గా ఆలోచించడం మానుకోవాలనుకున్నా.

మర్నాడు సాయంత్రం దాకా మళ్ళీ మా మధ్య ఆ విషయం తలెత్తలేదు. రాత్రి పడుకోబోయే ముందు మాత్రం అతనే అన్నాడు– "రేపు సెలవు పడేయ్... పొద్దున్నే హాస్పిటల్‌కు వెళ్దాం" అని. ఏమీ తినకుండానే బయలుదేరాలి... కంఠంలో అలవాటు ప్రకారం ఆజమాయిషీ తొంగి

చదువు, ఉద్యోగం ఆడవారి గౌరవాన్ని పెంపొందిస్తుందని విని నిజమనుకున్నాను... ఎంత పిచ్చితనమో కదా! ఎదుటివాళ్ళకు సంస్కారం లేనంత వరకూ, నీకున్న డిగ్రీలు, పదవులు నిన్ను నిన్నుగా నిలబెట్టగలవా!

చూస్తోంది. అదేంటి దగ్గరుండి చెకప్ చేయించడానికి తీసుకెళ్తాడా? దానికి పరిగడుపున దేనికి? పరి పరి ఆలోచనలు నన్ను చికాకు పెడ్తున్నాయ్... ఏమైనా అసలు విషయం అడగాలనుంది, అడిగినా సమాధానం రాదని తెల్సు. అందుకే ఊరుకున్నా... ఆ రాత్రంతా నిద్రలేదు. తెల్లవారడానికి ఇంకెన్ని ఏళ్ళు అన్నట్టు గడిచింది.

మర్నాడు ఉదయమే ఏడు గంటల కల్లా బయల్దేరాం... కారు హాస్పిటల్ ముందు ఆగింది... ఇద్దరం లోపలికి నడిచాం. తనే ఎవర్నో పలకరిస్తున్నాడు... ఈలోగా ఆసుపత్రిలో వున్న సిస్టర్ ఓ అప్లికేషన్ ఫారం ఇచ్చింది. తను నింపి, నా చేతికి ఇచ్చాడు సంతకం పెట్టమని... ఏంటిది? అడిగానో లేక అతన్ని అడగాలనుకుని ఆగిపోయానో... అర్థం అయ్యి కానట్టు వుంది నా పరిస్థితి... ముందు సంతకం కానీయ్, డాక్టర్ రెడీగా వుంది. కాస్త గద్దింపుగా చెప్పాడు... అంటే... అంటే ఏంటి? డాక్టర్ రెడీగా వుండటం ఏంటి? అప్పుడు చూశాను అప్లికేషన్‌లోకి. ఎం.టి.పి... మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ అని టిక్ చేసివుంది. అప్పటికే కళ్ల నిండా నీళ్లు... అక్షరాలు మసకగా కన్పిస్తున్నాయ్.

ఇప్పుడిదెందుకు? నాకు ఈ బిడ్డ కావాలనుంది... కాస్త గట్టిగానే నిలబడ్డాను ఈసారి. నాకఖ్ఖర్లేదు అవతలి కంఠం కరకుగా ధ్వనిస్తోంది. నువ్వు తల్లి అవుతానంటే సరిపోదు... తండ్రిగా నేను ఒప్పుకోను. నీ బిడ్డకు తండ్రిగా నేనుండలేను. ఇంకేం మాట్లాడకు అన్నట్టు చెప్తున్నాడు. అలాంటపుడు ఎందుకు నాతో... అని అడగాలనుకున్నా... కానీ నా సంస్కారం నన్ను ఆపింది.

సభ్యత, సంస్కారం ఇవన్నీ ఒక్కోసారి మనల్ని చేతగానివాళ్లుగా నిలబెడ్తాయి కదా... నీతో మాటలనవసరం... ఇక చర్చించేదేమీ లేదు... చక చకా కానీయ్... అవతల థియేటర్‌లో వాళ్ళు ఎదురు చూస్తున్నారు... కళ్ళతోనే తరిమాడు.

ఎప్పటిలాగే ఈసారీ నా నోటినుంచి మాట రాలేదు. మాంత్రికుడి వశమైన ఆడపిల్లలా ఏం చెప్తే అదే చేయడం... మళ్ళీ ఈసారి అదే... మళ్ళీ మళ్ళీ అదే... అడుగులు ఆపరేషన్ థియేటర్ వైపు ఎలా కదిలాయో ఏం గుర్తు లేదు.

మెల్లిగా కళ్లు తెరూ... ఎవరో చెప్తున్నారు. ఏమైనా నొప్పిగా వుందా? పెయిన్ కిల్లర్ ఇచ్చాం తగ్గుతుంది లే... అలవాటు ప్రకారం చెబుతోంది ఆ గొంతు. కాళ్ల మధ్యనేదో నొప్పి... ఊహూ, గుండెల్లో ఏదో చిత్రవధ. ఎందుకు వద్దన్నట్టు? ఎందుకు నా బిడ్డకు తండ్రి కాలేనన్నాడు? మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న మనసును తొలుస్తోంది. సమాధానం మాత్రం అంతు చిక్కట్లేదు.

నీ పనే నువ్వు సరిగ్గా చేసుకోలేవ్! పిల్లల్ని ఎలా పెంచగలననుకున్నావ్... ఓ రోజు వెక్కిరింపుగా అన్నాడు. ఏం నాలాంటి వాళ్లు ఎందరు తల్లులు కాలేదు? ఇంకేముంది ఈ బంధం కాపాడుకోవడానికి అన్న నిస్పృహలో ఎదురు సమాధానం వచ్చింది నా నుంచి.

అయితే? అది వాళ్ళిష్టం... ఇది నా యిష్టం... నిన్ను భార్యగా భరించడమే ఎక్కువ అనుకుంటే, ఇక పిల్లలకు తల్లిని చేశానంటే ఈ భూమ్మీద నిలుస్తావా? ఎక్కడో సూదులు పొడుస్తున్నట్టు అతని మాటలు గుచ్చుకుంటున్నాయ్... నీ జీవితానికి ఏ ఆధారం లేకుండా చేయడమే నా లక్ష్యం అన్న పొగరు ఎప్పుడూ అతని చేతల్లో, మాటల్లో కన్పిస్తూనే వుంటుంది.

అయినా, తను చెప్పిందీ నిజమే! నా పనే నేను సరిగ్గా చేసుకోలేను, ఇంక పిల్లలెందుకో? ఎందుకు? నేను స్త్రీగా పరిపూర్ణత పొందాలనుకుంటాను? అమ్మతనం ఆడవాళ్లను తాము సంపూర్ణ మహిళ అన్న భావనను కల్పిస్తుందా? స్త్రీత్వాన్ని ప్రపంచానికి చాటాలంటే అమ్మ కావడమే మార్గమా? అందుకేనా తల్లి కాలేని బంగారు తల్లులంతా జీవితమే భారం అన్నట్టు బతుకుతారు... మరి మగాళ్ళకి? వాళ్ళకి తండ్రి కావాలన్న కోరిక వుండదా? వాళ్ళ మగతనం చాటడానికి వాళ్లు తండ్రులవ్వఖ్కర్లేదా? ఎంత వెర్రి ప్రశ్న ఇది... తన మగతనానికి నిదర్శనం తండ్రిగా నిలబడటమే అని మగాణ్ణి నిర్వచించగల్గిన రోజు సంఘంలో ఇన్ని అరాచకాలు ఎందుకుంటాయ్? అందరికీ నాన్న కాగల్గటం, అందరినీ చేరదీసే గుణం అతనికే వుంటే ఆడపిల్లలకు ఈ కష్టాలెందుకొస్తాయ్?

అందుకేగా వైకల్యం ఆడవారిదైతే మగవారికి వాళ్లు భారంగా మారతారు. అదే శిక్ష భగవంతుడు మగాళ్లకేస్తే వాళ్లని కన్నబిడ్డల్లా కళ్ళలో పెట్టి చూసుకోదూ.. భార్య... అందుకే తను అందరికీ అమ్మ కాగలదు...

మరి ఇంత చదువూ, ఇలాంటి ఉద్యోగం వుండి కూడా ఎదుటివాళ్ల ఛీత్కారాలన్నీ సహించాలంటావా? ఓ నా ఆత్మాభిమానమా! ఎక్కడున్నావ్? కనబడవేం? నా అభిప్రాయం కనుక్కోకుండా తను ఔనన్నాననడన్న ఒకే ఒక్క కారణంతో నా కంటే పదిహేనేళ్ళు పెద్దవాడు, ఏ ఉద్యోగం లేక అవారాగా తిరుగుతున్నా, మగాడైన ఒకే ఒక్క కారణంతో నా వాళ్ళు అతణ్ణి అందలం ఎక్కించిన నాడే, అతడికి నన్ను ధారపోసిన నాడే ఇక నా జీవితంలో నీకు చోటు లేదని వెళ్ళిపోయావా? ప్రతీరోజూ అర్ధరాత్రి తాగిన మైకంలో తలుపు కొడితే హడిలిపోయి నేను తలుపు తెరిచినపుడే పారిపోయావా? అతడి ఇంట్లో, వంట్లో పరాయి వాళ్ల గుర్తులు చూసి కూడా నోరు మెదపలేని నా నిస్సహాయ స్థితిని చూసి విసిగి వెళ్ళిపోయావా? నా కంటూ ఓ నలుసును ఈ భూమ్మీద పడకుండా అతను అడ్డుకుంటే అచేతనంగా నిలబడి అతనికి తలవంచిన నా అశక్తతను భరించలేక పరుగులెట్టావా? పోతే పోయావ్ కానీ, నేనున్నానంటూ ఇంకెప్పటికీ రాకు... ఎందుకంటే నువ్వు వచ్చి, నన్ను నిద్ర లేపి, నాకూ మనసు, ఆత్మ ఉందని చెప్పావా, ఈ జీవితం మీద తిరగబడాలనిపిస్తుంది కానీ ఇపుడా శక్తి లేదు నాకు.

చదువు, ఉద్యోగం ఆడవారి గౌరవాన్ని పెంపొందిస్తుందని విని నిజమనుకున్నాను... ఎంత పిచ్చితనమో కదా! ఎదుటివాళ్ళకు సంస్కారం లేనంత వరకూ, నీకున్న డిగ్రీలు, పదవులు నిన్ను నిన్నుగా నిలబెట్టగలవా!

హయ్యో నిలబడటం అంటున్నావేమిటి? నిల్చోవడం అంటే ఏంటో మరిచిపోయి చాలా కాలమైంది కదూ...

"నీ కాళ్ల మీద నువ్వు నిలబడడానికి" అంటూ ప్రభుత్వం చదువు చెప్పించి, ఉద్యోగం ఇచ్చి, ఎన్ని సదుపాయాలిచ్చినా ఉన్న కర్ర ఊతం చాలదని, పెళ్ళంటూ ఎవర్నో సాయం కోరాను. జీవితం మెరుగవుతుందని ఆశపడ్డాను... కానీ ఆనాడే నేను కూలబడిపోయాను... అప్పట్నించీ ప్రతీ క్షణం పాతాళంలోకి ఎవరో నెట్టేస్తున్నట్టనిపిస్తుంది...

మరి, నేను "physically challenged" అంటూ నా certificate చెప్తూంటే, నేను physically మరి mentally కూడా handcaped అని గేలి చేస్తుందేమిటి నా మనసు?

రచయిత్రి సెల్: 98480 36760

స్ఫూర్తినిచ్చిన గురువు ■

లఘువును గురువుగా చేసిన గురువు

అది 1960వ దశకం. దారీ తెన్నూ లేని ఊరు మా రంగాపురం. బస్సు ఎక్కాలంటే ఎనిమిది కిలోమీటర్ల దూరం నడవాల్సిందే. పైగా మోకాలి లోతు బురద. అందుకే మా ఊరును బురద రంగాపురం అని పిలిచేవారు. అక్కడికి ఏ ప్రభుత్వ అధికారీ రాలేని రోజులు. కాపు సారాకు కూడా మా వూరు ప్రసిద్ధి. ఆ రోజల్లో మా ఊరికో యువకుడు బడి పంతులుగా వచ్చాడు. అప్పటి పంచాయితీ సమితి ఆఫీస ఉలో మా ఊరికి పోస్టింగ్ ఇస్తే అందరూ ఆ ఊరా? ఇంత వరకు అక్కడ ఎవ్వరూ మూడు నెలలు కూడా పని చేయలేకపోయారని ఆయన్ను భయపెట్టారట. కానీ ఓ సాయంకాలం ఆయన వచ్చారు (ఆయన మంచి రోడ్లు, వసతులున్న లంకపల్లి నుండి వచ్చారు). మా ఊరి పరిస్థితులకు భయపడలేదు. అక్కడి వారితో బాగా కలిసిపోయారు. అందర్నీ కూడగట్టి వచ్చిన కొద్ది కాలానికే బడి కోసం ఒక పాక వేయించి, అదే పాకలో ఒక పక్క మరో గది కట్టించుకుని అందులో కాపురం పెట్టారు. చదువంటే ఏమిటో ఎరుగని మా ఊరి ప్రజల్లో చదువు విద్యా దీపం వెలిగించారు మా గురువుగారు మువ్వా వెంకట్రామయ్యగారు. లంకపల్లి మాస్టారని మా వూరివాళ్లు ఆయన్ని ప్రేమగా పిలిచేవారు. ఆయన ఉదయాన్నే ఇంటింటికీ తిరగి పిల్లల్ని బడికి పంపాలని ప్రోత్సహించి, ఇంకా చెప్పాలంటే ఆదేశించేవారు. దాదాపు ఒక దశాబ్దం పాటు అక్కడి పిల్లల భవిష్యత్తు తీర్చి దిద్దారు. ఆయన కేవలం పిల్లల బడికే పరిమితం కాలేదు. ఊరి యువకుల్ని ఉత్సాహపరిచి వారితో చెడుగుడు, కొబ్బరికాయ పందాల వంటివి అనేకం ఆడించేవారు. స్వయంగా ఆయన మంచి ఆటగాడు కూడా. ఆయన మాటంటే ఊరందరికీ శిరోధార్యమే. ఏ ఒక్కరికీ అక్షరం ముక్కరాని వెనుకబడిన బురద రంగాపురానికి ఆయన వేసిన చదువుల పునాది, నేడు ఆ వూరి నుండి ఎందరినో విద్యాధికులు కావడానికి తోడ్పడింది. ఇప్పుడు ఆ మండలంలోనే అత్యధిక విద్యాధికులున్న ఊరుగా మారడంలో ఆయన పాత్ర మరువలేనిది. నాలాంటి ఎందర్నో గురువులుగా తీర్చిదిద్దిన ఆయన్ను, వారి కుటుంబాన్ని మా ఊరు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుంది. ఎందరో లఘువులను గురువులుగా తీర్చిదిద్దిన వెంకట్రామయ్య మాస్టారుకి ఇదే మా నమస్సుమాంజలులు.

– ప్రొ.కట్టా సత్యప్రసాద్,ఉస్మానియా యూనివర్శిటీ

■ స్మరణ

నాజీలను ఎదిరించిన సీగ్రిడ్ ఇండ్సెట్

సీగ్రిడ్ ఇండ్సెట్ (20 మే 1882-10 జూన్1949)

నార్వేలో సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన వారిలో సీగ్రిడ్ ఇండ్సెట్ మూడోవారు. అయినా ఆ బహుమతి పొందిన ఆ దేశపు మొదటి మహిళ. స్కాండినేవియా మధ్య యుగంలోని జీవితాన్ని శక్తివంతంగా చిత్రించినందుకు, 1928లో ఇండ్సెట్‌కి ఈ బహుమతి లభించింది. బహుమతి ప్రదాతల నిర్ణయానికి కారణం, 14వ శతాబ్దపు మధ్య యుగం నేపథ్యంతో రాసిన వారి మూడు సంపుటాల క్రిస్టిన్ లవ్రన్స్ డిట్టర్ నవలతో బాటు, 4 సంపుటాల మరో నవల ఓలవ్ ఔడున్ స్సొన్ కూడా నోబెల్ బహుమతి రాక ముందే ఆమె రచనలు విదేశీ భాషల్లోకి అనువాదమయ్యాయి. 1928 తరువాత ప్రతీ ప్రధాన భాషలోకి అనువాదం చేశారు. ఆమె రచనలు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ కొత్త తరం పాఠకులు సైతం చదువుతున్నారు. రాసిన 36 పుస్తకాలు, మధ్యయుగానికి సంబంధించినవే కావు, సమకాలీన నవలలు, సాహిత్య చారిత్రక వ్యాసాలూ ఉన్నాయి. అన్ని సమయాల్లోనూ అన్ని ప్రదేశాల్లోనూ, మానవ మేధస్సు పద్మ వ్యూహాన్ని, విస్తారమైన వాస్తవిక పరిచయంతో చెప్పగలిగే ప్రావీణ్యం ఉన్న గొప్ప కథకురాలు. ఆమె చారిత్రక సాహిత్య అనుభవం, ప్రకృతి జ్ఞానం దాని ప్రాముఖ్యం -భావావేశం మేధాసంపత్తి ఇవన్నీ తన రచనలకు ఎంతగానో తోడ్పడ్డాయి.

ఇంతకీ ఈ సీగ్రిడ్ ఇండ్సెట్ ఎవరు? ఇండ్సెట్ ఇంటి పేరు కాదు. ఆమె తాతయ్య మామ్మ నివసించిన శివారు గ్రామం పేరు. ఆమె తాతయ్య దానిని ఇంటి పేరుగా మార్చుకున్నారు. సీగ్రిడ్ ఇండ్సెట్ పుట్టిన ఏడాదే, ప్రఖ్యాత రచయితలు వర్జీనియావుల్ఫ్, జేమ్స్ జాయిస్ లాంటివారు జన్మించారు. అంతకు మూడేళ్లకు పూర్వం డి.హెచ్. లారెన్స్, కరెన్ బ్లిక్సెన్ జన్మించారు. ఇవేవీ అంత ముఖ్యం కాదు, సమకాలికులని తెలుసుకునేందుకు తప్ప. అయితే డి.హెచ్. లారెన్స్ రచనలు 1930లో ఆమెని విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరంతా యూరప్ వాసులు, అక్కడి సంక్షోభాల పట్ల జాగరూకులు. సీగ్రిడ్ ఇతివృత్తాలు నార్వేవే కాదు, యూరప్‌వి కూడా. అలానే జేమ్స్‌జాయిస్ ఇతివృత్తాలు ప్రత్యేకంగా ఐరిష్‌వే కావు యూరప్‌వి కూడా.

సీగ్రిడ్ తండ్రి ఇంగ్వల్డ్ ఇండ్సెట్ అంతర్జాతీయంగా గౌరవింపబడ్డ పురాతత్వ శాస్త్రవేత్త, వారి ప్రత్యేకమైన విషయం, యూరప్‌లోని లోహ యుగం, యూరప్ పూర్వ చరిత్ర, వృత్తి పరంగా యూరప్ అంతా విస్తృతంగా పర్యటించారు. తల్లి కార్లెట్టె ఇండ్సెట్, యూరప్ సంస్కృతి బాగా తెలిసిన డానిష్ యువతి. భర్త పనిలో అన్ని విధాలా సాయపడేది. జర్మనీ, ఫ్రెంచ్ భాషలు మాట్లాడేది. డెన్మార్క్‌లోని కలుండ్బర్గ్‌లో, తల్లి ఇంట సీగ్రిడ్ ఇండ్సెడ్ జన్మించారు. ముగ్గురు కూతుళ్ళలో సిగ్రిడ్ పెద్దది. తండ్రి అనారోగ్యం కారణంగా రెండేళ్ల ప్రాయంలో కుటుంబం అంతా నార్వేకి తరలి వచ్చింది. అక్కడి రాజధాని క్రిస్టీనియాలో (1925 నుండి క్రిస్టీనియా, ఓస్లో గా మారింది) సీగ్రిడ్ పెరిగింది. ఆమె మొదటి 11 ఏళు ్ల తండ్రి అనారోగ్యంతోనూ, తండ్రి విస్తృత చారిత్రక పరిచయాన్ని తెలుసుకోడంలోనూ గడిచిపోయింది.

చిన్న వయసులోనే సీగ్రిడ్, పురాతత్వ శాస్త్రం, స్కాండినేవియా జానపద పాటల్లోని మర్మాలను చదువుకున్నారు. ఆమె 11 ఏళ్లప్పుడే, 40 ఏళ్ల సీగ్రిడ్ తండ్రి మరణించాడు. ముగ్గురు చిన్న కూతుళ్ళను, ఉన్న తక్కువ సంపాదనతో తల్లి పెంచాల్సి వచ్చింది. భర్త సేకరించిన పుస్తకాల్ని, ప్రాచీన కాలంనాటి వస్తువుల్నీ, ఆమె తల్లి అమ్ముకోక తప్పలేదు. (వాటిని ఆ తరువాత సీగ్రిడ్ వెదికి వెనక్కి తెచ్చుకోగలిగారు.) ఆ విషాదం సీగ్రిడ్ మీద, బాల్యంలోనూ, యవ్వనంలోనూ బలమైన ముద్ర వేసింది. కాలేజీలో చదువు కోవాలన్న ఆశ వదులుకోవల్సి వచ్చింది. 16 ఏళ్ల ప్రాయంలోనే చిత్రకళ నేర్చుకోవాలని ఉన్నా, స్టెనో టైపిస్టు శిక్షణ తీసుకుని క్రిస్టీనియాలోనే ఒక పెద్ద ఇంజనీరింగ్ సంస్థలో ఉద్యోగంలో చేరాల్సి

డి.హెచ్. లారెన్స్ రచనలు 1930లో ఆమెని విశేషంగా ఆకట్టుకున్నాయి. వీరంతా యూరప్ వాసులు, అక్కడి సంక్షోభాల పట్ల జాగరూకులు. సీగ్రిడ్ ఇతివృత్తాలు నార్వేవే కాదు, యూరప్‌వి కూడా. అలానే జేమ్స్‌జాయిస్ ఇతివృత్తాలు ప్రత్యేకంగా ఐరిష్‌వే కావు యూరప్‌వి కూడా.

వచ్చింది. తన తల్లి, ఇద్దరు చెల్లెళ్ల పోషణకు ఆ సంపాదన చాలా అవసరమైంది. ఇష్టం లేకపోయినా, అదే సంస్థలో కార్యదర్శి స్థాయిలో పదేళ్లు పనిచేయాల్సొచ్చింది. అయితే అక్కడ ఒక క్రమ పద్ధతిలో పనిచేయడం, ఆ తరువాత సాహిత్య వ్యాసంగానికి సైతం ఉపకరించింది.

ఉద్యోగంలో ఉన్న కాలంలో కూడా అర్ధరాత్రుల వరకూ, వారాంతాలలోనూ, సెలవుల్లోనూ వీలు చూసుకుని, సాహిత్య అధ్యయనంలోనూ, రాసుకోవడంలోనూ, సీగ్రిడ్‌కు సమయం గడిచిపోయేది. పదహారేళ్ల ప్రాయంలో మొదలెట్టిన డెన్మార్క్ నోర్డిక్ మధ్యయుగం మీద మొదటి నవల, కొన్ని సంవత్సరాల వరకూ కొనసాగింది. చివరకు 22

ఏళ్లకు పూర్తి చేయగలిగారు. దాన్ని ప్రచురణకర్తలు అంగీకరించపోవడంతో కొన్నాళ్లు కుంగిపోయిందామె. అయితే రెండేళ్ల తరువాత, క్రిస్టీనియాలోని ఒక సమకాలికురాలి జీవితం ఆధారంగా రాసిన 80 పేజీల చిన్న నవల "వంచించిన భార్య" పూర్తిచేసింది. అది కూడా మొదట్లో ప్రచురణకర్తలు స్వీకరించకపోయినా, అప్పటి ఒక ప్రముఖ రచయిత ప్రమేయంతో అంగీరించారు. 25 ఏళ్ల ప్రాయంలో అలా ఆమె మొదటి నవల ప్రచురితమైంది. అది నార్వేలో వర్ధమాన రచయిత్రిగా ఆమెకి గుర్తింపు తెచ్చింది. దరిమిలా 1919 లోగా 10 నవలల వరకూ పూర్తి చేశారు. అవన్నీ సమకాలీన క్రిస్టీనియా నేపథ్యంలో రాసినవే.

ఆయా నవలల్లో ప్రధాన విషయాలు స్త్రీలు వారి ప్రేమ, ఆమే అన్నట్లు నీతిబాహ్యమైనటు వంటి ప్రేమ. 1911లో వచ్చిన జెన్నీ (నవ్య) నవలలో– ఒక చిత్రకారిణి, కాల్పనిక సంక్షోభం మూలంగా, తన జీవితం వ్యర్థం అవుతోందన్న అనుమానంతో ఆత్మహత్య చేసుకుంటుంది. 1914లో వచ్చిన వసంతం నవలలో–ఒక స్త్రీ తనని తన ప్రేమని వైవాహిక సంక్షోభంలో చిక్కుకోకుండా, తన కుటుంబాన్ని కాపాడుకుంటుంది. ఈ నవలలు అప్పట్లో యూరప్‌లో ఆరంభమవుతున్న స్త్రీల ఉద్ధరణ ఉద్యమానికి, విరుద్ధం కాకపోయినా పూర్తిగా భిన్నం. ఆమె పుస్తకాల అమ్మకం పెరగడంతో, మూడవ నవల వచ్చిన తరువాత ఉద్యోగ విరమణ చేసి, పూర్తి స్థాయి రచయిత్రిగా స్థిరపడ్డారు. రచయిత్రిగా కొనసాగేందుకు ఉపకార వేతనం పొంది, యూరప్, డెన్మార్క్, జర్మనీ, ఇటలీ, రోమ్ సందర్శించారు. రోమ్‌లోనే తొమ్మిది నెలలు ఉండిపోయారు. అక్కడే నార్వే చిత్రకారుడు ఆండెర్స్ కస్టస్ స్వర్టస్‌తో పరిచయం, మూడేళ్ల తరువాత వివాహానికి దారితీసింది. అప్పటికి ఆమెకు 30 ఏళ్లు. అతను వివాహితుడు, ముగ్గురు పిల్లల తండ్రి. మొదటి భార్యకు విడాకులిచ్చాడు. 1912లో వివాహం జరిగింది. ఆ తరువాత ఆరు నెలలు లండన్‌లో ఉన్నారు. అతను చిత్రకళలోను, సీగ్రిడ్ ఆంగ్ల కళా సాంస్కృతిక విషయాల అధ్యయనంలోను గడిపారు. అది వారికి జీవితాంతం ఉపయోగపడింది. లండన్ నుండి రోమ్‌కు తిరిగొచ్చాక 1913లో వారికి పుట్టిన మగబిడ్డకు తండ్రి పేరు పెట్టుకున్నారు. 1919 సరికి ముగ్గురు పిల్లలు. అందులో రెండో బిడ్డ మంద బుద్ధి. వచ్చి పోయే పాత కొత్త మిత్రులతో సాహిత్య వ్యాసంగానికి తీరిక చిక్కేది కాదు. రాత్రులు అందరూ నిద్ర పోయాక రాసుకునేందుకు ప్రయత్నించేదామె. మూడవబిడ్డ పుట్టే సమయానికీ భర్తతో విభేదాలొచ్చి, కొంతకాలం వేచి చూసినా 1919లో విడిపోక తప్పలేదు.

మొదటి ప్రపంచ యుద్ధం, వైవాహిక జీవితం మూలంగా సీగ్రిడ్‌లో మత నమ్మకాలు సైతం మారి, క్రైస్తవం పట్ల ఆమె దృక్పథంలో మార్పు వచ్చింది. ఒకప్పుడు మనిషే దేవుణ్ని సృష్టించాడనుకున్నది. కాదని, దేవుడే మనిషిని సృష్టించాడన్న నమ్మకాని కొచ్చారు. తల్లిదండ్రులు నాస్తికులైనా, జీవితంలో ఎక్కువ భాగం వీరు కూడా లౌకిక అజ్ఞేయవాదిగా ఉన్నా, 42 ఏళ్ల ప్రాయంలో, 1924లో కేథలిక్కుగా మారిపోయారు. అది అనేక వివాదాలకు దారితీసింది. వారిమీద దాడులు కూడా చేసే స్థాయికి అవి వెళ్లాయి. అయినా ఆమె వాదనా ప్రతిభతో వాటిని తట్టుకుని నిలబడి, రచయిత్రిగా తన ప్రస్థానాన్ని మరింత పట్టుదలతో కొనసాగించడం విశేషం. అది 1920లో "క్రిస్టిన్ లవ్రన్స్ డాట్టెర్" సర్వోత్తమ నవల బయటకు రావడానికి సరైనా భూమికని ఏర్పర్చింది. మూడు సంపుటాల చారిత్రక నవల అది. అందులో సీగ్రిడ్ తనకే ప్రత్యేకమైన తన భావాల్ని, ఆనంద విషాదాల్ని, పరవశత్వాన్ని నైరాశ్యాన్ని మధ్య యుగంలో చూసుకుంది. జటిలమైన ధనిక క్రిస్టేన్, తన ఆనందాలతోను, కష్టాలతోను, స్త్రీగా పరివర్తన చెందుతున్న క్రమంలో, ఆ నవలను శాసిస్తుంది. ఒక స్త్రీ జననం నుంచి మరణం దాకా సాగిన 1400 పేజీల నవల, 1927లో రాసిన మరో బృహత్ నవల 1200 పేజీల "ఓడున్ స్మాన్" కాలానికి ఎదురునిల్చేవి. ఈ నవలల్లోని జవజీవాలతో కూడిన పాత్రలు పద్నాలుగవ శతాబ్దానికి చెందినవైనా, ఇప్పటికీ మన ఇరుగు పొరుగు వారేనేమో అన్నట్లుంటాయి. ఆ కాలంలో ఆమె పరిపక్వత, జీవన దృక్పథం అత్యున్నత దశలో ఉండటం వల్ల ఆ నవలలు గొప్ప సృజనాత్మకతతో ఆవిష్కారమొందాయి.

ఈ సృజనాత్మక విస్ఫోటనం తరువాత, సీగ్రిడ్ రచయిత్రిగా నెమ్మదించారు. మళ్లీ 1929 తరువాత ఆమె నవలా పరంపర సమకాలీన నార్వే ఓస్లో లోని బలీయమైన కేథలిక్ మూలాలతో కొనసాగింది. ఇక్కడ కూడా ప్రేమ ప్రధాన వస్తువు. తమ అంతరాత్మకు అవిధేయులయినపుడు,

ఆమె పుస్తకాల అమ్మకం పెరగడంతో, మూడవ నవల వచ్చిన తరువాత ఉద్యోగ విరమణ చేసి, పూర్తి స్థాయి రచయిత్రిగా స్థిరపడ్డారు. రచయిత్రిగా కొనసాగేందుకు ఉపకార వేతనం పొంది, యూరప్, డెన్మార్క్, జర్మనీ, ఇటలీ, రోమ్ సందర్శించారు.

తరచు ఆమె నాయికలు, విషాద పర్యవసానాల్ని చవిచూస్తారు.

కాగా, 1934లో "సుదీర్ఘ సంవత్సరాలు" శీర్షికన చిన్నప్పటి జ్ఞాపకాలతో స్వీయచరిత్ర రాసారు. అదే సమయంలో 18వ శతాబ్దపు స్కాండినేవియా చారిత్రక నవల మొదలు పెట్టి, మొదటి సంపుటం "మేడం డోర్తియా" మాత్రమే పూర్తిచేసి, 1939 నాటికి ప్రచురించ గలిగారు. ఈ లోగా రెండో ప్రపంచ యుద్ధం మొదలయింది, అది ఆమె సర్వ శక్తుల్ని హరించింది. 1939లో తల్లి, కుమార్తె ఇద్దరూ మరణించారు.

నాజీలను బహిరంగంగా విమర్శించడంతో ఆమె పుస్తకాల్నీ జర్మనీలో నిషేధించారు. నార్వే అధికారులు ఆమెని దేశం విడిచి పారిపొమ్మని సలహా ఇచ్చారు. పెట్టె సర్దుకునేందుకు కూడా సమయం లేదు. జర్మనీ చేతికి తాను చిక్కకుండా తప్పించుకున్నా, నార్వే సైన్యంలో అధికారిగా పనిచేస్తున్న ఆమె పెద్ద కుమారుడిని జర్మనీ సైన్యాలు చంపేశాయి. కొన్ని సంవత్సరాలపాటు ఆమె ఇంటిని జర్మన్లు ఆక్రమించారు. ఆమె రాతబల్లని ముక్కలు చేసి కాల్చేసారు. యుద్ధ సమయంలో ఆ ఇంటిని జర్మనీ సైన్యాధికారులు తమ నివాసంగా వాడుకున్నారు. 1940లో చిన్న కొడుకుని తీసుకుని అమెరికా వెళ్లి, నార్వే విముక్తి కోసం ప్రయత్నాలు చేసారు. అమెరికాలో నిర్వాసితగా బ్రూక్లిన్‌లోని ఒక చిన్న ఇంటిలో గడిపారు. 1945లో నార్వే విముక్తి చెందిన తరువాతే తిరిగొచ్చారు.

ఆ తరువాత మరో నాలుగేళ్లు బతికినా, అనారోగ్యం అనాసక్తత మూలంగా ఒక్క వాక్యం కూడా రాయలేదు. అత్యాధునిక రచయిత్రిగా, ప్రపంచ వ్యాప్తంగా అప్పటి సమకాలీన రచయితల చైతన్య స్రవంతి పద్ధతుల్ని అనుసరించిన వారిగా గుర్తింపు పొందారు.

– ముకుంద రామారావు, 99083 47273

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

డ్రోన్‌ల ద్వారా ఇంటర్నెట్

ఇంటర్నెట్... మానవాళికి అదో ఉత్ప్రేరకం.... ఇదో మానియా. ప్రస్తుతం ఇంటర్నెట్‌లేని ప్రపంచాన్ని ఊహించలేని పరిస్థితి. ప్రపంచంలోని దాదాపు 293కోట్ల మందికి ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉంది. గూగుల్ ప్రతి సెకనుకూ 40వేల సెర్చ్‌లు చేస్తుండగా, ఫేస్‌బుక్‌లో 40వేల లైక్‌లు, కామెంట్లు నమోదవుతున్నాయి. ఇంతే సమయంలో యూట్యూబ్‌లోకి రెండు గంటల నిడివి గల వీడియోలు అప్‌లోడ్ అవుతున్నాయి. ఈ లెక్కలన్నీ నాణేనికి ఒకవైపు మాత్రమే. ఈ రోజుకీ ప్రపంచంలో ఎంతో మందికి ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేదు. వారి సంఖ్య దాదాపు 440 కోట్ల పైగానే వుంటుందని అంచనా. ఒకవైపు 4జీ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చేస్తున్నా... కొన్ని ప్రాంతాల్లో మాత్రం తొలితరం ఇంటర్నెట్ సేవలు కూడా అందుబాటులో లేవు.



వాస్తవానికి ఇంటర్నెట్ ఇంత విస్తృతం అయ్యిందంటే అది ఆప్టికల్ ఫైబర్ అందించిన సౌకర్యం. ఉత్తమ బ్యాండ్ విడ్త్‌తో ఇంటర్నెట్ సిగ్నల్స్ పాస్ చేయగల ఆప్టికల్ ఫైబర్ ప్రపంచ గతిని ప్రభావితం చేస్తోంది. అయితే... పూర్తిగా ఆప్టికల్ ఫైబర్ మీదే ఆధారపడటం వల్ల విస్తరణ వేగం తగ్గుతుంది. ప్రస్తుతం పెరుగుతున్న అవసరాల రీత్యా ఇంటర్నెట్‌ను మరింత విస్తృతం చేయాలి. ఆ సౌకర్యాన్ని ఎక్కువమందికి అందించాలి. ఆప్టికల్ ఫైబర్, వెబ్ కేబుల్స్, లైన్‌ల మీద ఆధారపడితే అదంత సులభంగా సాధ్యపడదు. ఈ నేపథ్యంలో తీగలు, వైర్లూ లేకుండా అందరికీ ఇంటర్నెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఫేస్‌బుక్ ప్రయత్నం చేస్తోంది. దీనికోసం కొత్తగా డ్రోన్ టెక్నాలజీని వాడబోతున్నారు. ఒక్కో డ్రోన్ ద్వారా దాదాపు 21,562 మీటర్ల పరిధిలోని ప్రాంతానికి ఇంటర్నెట్ సిగ్నల్స్ అందించవచ్చునని అంచనా. దీన్నిబట్టి దాదాపు 21 కిలోమీటర్ల పరిధిలో వైఫై ద్వారా సిగ్నల్స్ అందుబాటులోకి వస్తాయి. జనావాసాల పరిధిని ఎంచుకొని డ్రోన్స్‌ను లాంచ్‌చేస్తే నాలుగో తరం ఇంటర్నెట్ సేవలను అందించినట్టే. ల్యాండ్‌ఫోన్ల స్థానంలో సెల్‌ఫోన్‌లు వచ్చి టెలికమ్యూనికేషన్ వ్యవస్థను ఏ విధంగా మార్చేశాయో డ్రోన్స్ కూడా ఇంటర్నెట్ కమ్యూనికేషన్‌ను అదే విధంగా మార్చేయగలదని నిపుణుల అంచనా.

అందుకే ఈ వ్యవహారాన్ని కొత్తరకంగా ముందుకు తీసుకెళ్లాలని ఫేస్‌బుక్ వ్యవస్థాపకులు మార్క్ జుకర్ బర్గ్ భావిస్తున్నాడు. అందుకు గాల్లో విహరిస్తూ ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందించే డ్రోన్స్‌ను రూపొందించే ప్రయత్నంలో ఉంది ఫేస్‌బుక్ యాజమాన్యం. 2015లో తొలి డ్రోన్ గాల్లోకి లేవాలనేది ఫేస్‌బుక్ లక్ష్యం. అది మొదట అందుబాటులోకి వచ్చేది మన దేశంలోనే. ఇప్పటికే భారత ప్రభుత్వానికి, ఫేస్‌బుక్‌కు మధ్య ఒప్పందం కూడా కుదిరింది. మొత్తం రెండున్నర లక్షల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందించాలనేది దీని లక్ష్యం.

ఈ ఏడాది మార్చిలో యూకేకు చెందిన 'అసెంటా ఏరోస్పేస్' సంస్థ వైఫై హాట్ స్పాట్‌గా పనిచేయగల ఒక డ్రోన్‌ను రూపొందించింది. ఈ ప్రయోగంపై దృష్టిసారించిన ఫేస్‌బుక్ 20 మిలియన్ డాలర్లను చెల్లించి ఈ ప్రాజెక్ట్‌ను సొంతం చేసుకుంది. అభివృద్ధి విషయంలో భాగస్వామిగా మారింది. దాదాపుగా విజయవంతం అయిన ఈ ప్రాజెక్టులో ఫేస్‌బుక్ కొన్ని మార్పులు కూడా సూచించింది. డ్రోన్స్‌కు ప్రత్యేకంగా ఇంధనం అవసరం లేకుండా సౌరశక్తితోనే పనిచేసేలా చూడాలనేది ఫేస్‌బుక్ చేసిన ప్రతిపాదన. అలాగే ఈ ప్రాజెక్ట్ విషయంలో నాసా, అమెస్ రీసెర్చ్ సెంటర్‌ల సహాయం కూడా తీసుకొంటున్నారు.

తీగలు, వైర్లూ లేకుండా అందరికీ ఇంటర్నెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఫేస్‌బుక్ ప్రయత్నం చేస్తోంది. దీనికోసం కొత్తగా డ్రోన్ టెక్నాలజీని వాడబోతున్నారు. ఒక్కో డ్రోన్ ద్వారా దాదాపు 21,562 మీటర్ల పరిధిలోని ప్రాంతానికి ఇంటర్నెట్ సిగ్నల్స్ అందించవచ్చునని అంచనా. దీన్నిబట్టి దాదాపు 21 కిలోమీటర్ల పరిధిలో వైఫై ద్వారా సిగ్నల్స్ అందుబాటులోకి వస్తాయి.

ఈ డ్రోన్స్ వైఫై హాట్‌స్పాట్స్‌లాగా పనిచేస్తాయి. కొన్ని వేల అడుగుల పైన విహరిస్తూ శాటిలైట్ నుంచి సిగ్నల్స్ తీసుకొని కొన్ని కిలోమీటర్ల పరిధిలోని కంప్యూటర్ సర్వర్‌లకు ఇంటర్నెట్‌ను అందిస్తాయి. దీనివల్ల మొదటి ఉపయోగం.. కేబుల్స్‌తో అవసరం లేకుండాపోతుంది. ఒక్కో డ్రోన్ ద్వారా దాదాపు 21,562 మీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సిగ్నల్స్ అందించవచ్చునని అంచనా. అంటే దాదాపు 21 కిలోమీటర్ల విస్తీర్ణంలో వైఫై ద్వారా సిగ్నల్స్ అందించవచ్చు. జనావాసాల పరిధిని ఎంచుకొని డ్రోన్స్‌ను లాంచ్‌చేస్తే అక్కడ నాలుగో తరం ఇంటర్నెట్ సేవలను అందించినట్టే. కేబుల్స్, ఫోల్స్, వాటి ఏర్పాటుకు పట్టే సమయం.. అంతా ఆదానే. ల్యాండ్‌ఫోన్ల స్థానంలో సెల్‌ఫోన్‌లు వచ్చి టెలికమ్యూనికేషన్ వ్యవస్థను ఏ విధంగా మార్చేశాయో డ్రోన్స్ కూడా ఇంటర్నెట్ కమ్యూనికేషన్‌ను అదే విధంగా మార్చేయగలవు.

ఈ టెక్నాలజీ పూర్తిస్థాయిలో విజయవంతం అయితే, ఇంటర్నెట్ వినియోగం ఇప్పటికంటే ఎన్నో రెట్లు విస్తృతం అవుతుందనడంలో సందేహంలేదు. ఇది ఒక్క ఫేస్‌బుక్‌కు మాత్రమే కాకుండా ఇతరత్రా అనేక ప్రయోజనాలకు కేంద్ర బిందువుగా నిలుస్తుందని చెప్పొచ్చు.

రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం



డా॥దేవరాజు మహారాజు
ఆవరణం
సంపాదకత్వం :
డి.కృష్ణకుమారి,
వెల : 200/-,
పేజీలు : 309
ప్రతులకు :
ప్రముఖ పుస్తక కేంద్రాలు

ఖమ్మం సాహితీ మూర్తులు
సంకలన కర్త : సంపటం
దుర్గా ప్రసాదరావు, వెల :
100/-, పేజీలు : 123
ప్రతులకు : ప్రజాశక్తి బుక్
హౌస్ అన్ని బ్రాంచీలు,
రచయిత, నెం.4-1-194,
రోటరీ నగర్, ఖమ్మం



తెలుగు భాషా శతకం
(తేటగీతులు), రాఘవ
మాస్టారు
వెల : 25/-, పేజీలు : 28
ప్రతులకు : కర్ణాటక తెలుగు
రచయితుల సమాఖ్య,
కళ్యాననగర్, బెంగలూరు.
అన్ని పుస్తక కేంద్రాలు

ప్రతిబింబం, ఆధివిమర్శ
వ్యాసాలు, డా॥లక్ష్మణ చక్రవర్తి
వెల : 150/-, పేజీలు : 190
ప్రతులకు:అమృత ప్రచురణలు,
శ్రీమతి సిహెచ్.గోదాదేవి,
ఇం.నెం.2-3-402,
కృష్ణానగర్ కాలనీ, అల్వాల్,
హైదరాబాద్

తెలంగాణ సాహిత్య చరిత్ర
ఆచార్య ఎస్వీ రామారావు
వెల : 200/-
పేజీలు : 248
ప్రతులకు :
ప్రముఖ
పుస్తక కేంద్రాలు

■ సమీక్షలు

సిక్స్త్ ఎలిమెంట్‌పై ఒక చూపు

సిక్స్త్ ఎలిమెంట్ (కవిత్వం), రచన: ముప్వా శ్రీనివాసరావు
వెల: రూ. 100, ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

మనిషి జీవిత అనుభవాలకు సంబంధించిన అనేకాంశాలు సరళంగా, కొత్తదనంతో ప్రతిఫలిస్తాయి ముప్వా శ్రీనివాసరావు కవిత్వంలో. సరికొత్త సాంకేతిక పోలికలు, అభివ్యక్తితో పాఠకుల్ని ఆకట్టుకుంటుంది వీరి కవిత్వం. గతంలో 'సమాంతర ఛాయలు' శీర్షికన ఒక కవితాసంపుటి వెలువరించారు. ఊరు, బాల్యం, తనను ప్రభావితం చేసిన వ్యక్తులు, శక్తులు మరెన్నో విషయాలు దీనిలో కలబోసుకుని కనిపించాయి.

తనకు జీవితంలో ఎదురైన అనేకానేక అనుభవాలు, కలిగిన అనుభూతులు, వ్యక్తిగతమైనవి, సమష్టి ప్రపంచంలోనివి, మనిషి మనస్సుకు సంబంధించిన అంశాలు, సంవేదనాభరితుల్ని చేసిన విషయాల మీద ముప్వా శ్రీనివాసరావు కవిత్వం రాశారు. ఈ క్రమాన మరో కవితాసంపుటి సిక్స్త్ ఎలిమెంట్ తీసుకొచ్చారు. సంభాషణాత్మక శైలిని అనుసరించిన కవితలు కొన్ని వున్నాయి. భౌతిక ప్రపంచంలోని, మనోలోకంలోని స్పందనలెన్నిటినో కవిత్వం చేశారు. 'చికాగోగీతం'లో 'రుధిర సముద్రాన్నై పులకించిపోతాను' అంటూ తన నిబద్ధతను చాటారు. పీడిత జనపతాకమై నిలిచిన ఆశయాలని 'మేడే' గీతంగా మలిచారు.

ఈ సంపుటిలో 'లావేగాస్' కవితలో ఒక్కొక్క పంక్తిని రసరమ్యగీతంగా రూపుదిద్దారు. 'ఫైర్ అండ్ ఫైర్' కవిత ఆర్థిక సంక్షోభాల పరిణామ ఫలితాన్ని వ్యక్తీకరించింది. 'మరోవైపు' కవితలో సమాజంలోని, జీవితంలోని కృత్రిమత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 'కలల పిడికిలి' కవితలో పోరాటాల కలల గురించి అభివ్యక్తం చేశారు. ఎన్నో సందర్భాల్లో తన స్పందనల్ని కవిత్వం చేయడానికి ముప్వా శ్రీనివాసరావు చేసిన ప్రయత్నాల పరంపరలో అద్భుతమైన కవిత్వం వచ్చింది. ఈ క్రమాన సిక్స్త్ ఎలిమెంట్‌లో వ్యక్తిగత అనుభూతులు, చేదు విషాదాలు, ఆనందపు ఘడియలు, జ్ఞాపకాల పరంపరలో ఆవిష్కృతమయ్యే అంశాలెన్నో కనిపిస్తాయి. సరళ సుందరమైన పదచిత్రాలు, భావచిత్రాలు దర్శనమిస్తాయి. పాఠకునికి ఒక కొత్త చూపుని అందిస్తాయి. జీవిత ప్రయాణంలో రకరకాల అనుభవాలు మనిషిని నిటారుగా నిలబెట్టాలని, నిబద్ధతతో నడుచుకోగలిగే మనోధైర్యాన్ని ఇవ్వాలన్న ఆకాంక్ష మిళితమైన కవిత్వమిది. అందుకే ముప్వా శ్రీనివాసరావు కవిత్వం చదవడం పాఠకునికి సరికొత్త అనుభవం.

– సిహెచ్. ఆంజనేయులు

విద్యారంగంపై ఓ బోధకుడి అంతర్వేదన



మానుకోట ముచ్చట్లు, రచన: సీతారాం, పేజీలు: 144,
వెల: రూ. 100. ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

వరంగల్ జిల్లా మానుకోట డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న తెలుగు లెక్చరర్ సీతారాం రాసిన వ్యాసాల సంపుటి ఈ పుస్తకం. 'మానుకోట ముచ్చట్లు' శీర్షికన వచ్చిన పుస్తకంలో నిజంగా ముచ్చట్లు చెబుతున్నట్టుగా అనేక విషయాల్ని రాశారు సీతారాం. కారేపల్లి జూనియర్ కాలేజీ నుంచి ఆ తర్వాత మానుకోట స్వతహాగా కవి అయిన సీతారాం లేని ఉండబట్టలేనితనం ఈ పుస్తకం రాయించింది. తనకెందుకులే అని బతకాలనుకున్నా బతకలేని సున్నితహృదయుడు కాబట్టి మానుకోట కేంద్రంగా విద్యావ్యవస్థలోని అపసవ్యతల్ని బయటపెట్టారు. ఆడపిల్లలకు త్వరగా ఎందుకు పెళ్ళిళ్ళు చేస్తారో, కాలేజీ లైబ్రరీల్లో పుస్తకాలు సరిగా ఎందుకు ఉండవో, ఉన్నా అక్కడికి పిల్లలు ఎందుకు రారో తన అనుభవ నేపథ్యం నుంచి చెప్పుకొచ్చారు. చదువుకునే ఆడపిల్లల పట్ల సున్నితంగా, మనిషిగా మగ లెక్చరర్లు వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. బోధనా ప్రమాణాలు పెరగాలని, పిల్లల ప్రతిభా పాటవాలు పెంపొందాలని ఆశించే లక్షణాలు అధ్యాపకులకు లేకపోతే వాటిల్లే విపరిణామాల గురించి హెచ్చరించారు. ఉపాధికి భరోసా ఇవ్వని చదువుల వల్ల ఒరిగేదేమిటనే ప్రశ్నల్లోని సంబద్ధతని చర్చించారు. ఒక్కమాటలో చెప్పాలంటే మొత్తం విద్యారంగంలో రావాల్సిన మార్పుల గురించి తన భావనా పరంపరని చిన్న చిన్న వ్యాసాల్లో ఆసక్తికరంగా వివరించారు కవి సీతారాం. అందుకే ఈ రంగానికి సంబంధించిన వారంతా ఈ పుస్తకం చదవడం మంచిది.

– అశోక్‌కుమార్



అక్షరాలతో చెక్కిన శిల్పంలా...

నా తెలంగాణ నేల గ్రహణం వీడిన వేళ
డా॥శ్రీమతి కె.బి. సంధ్యా విప్లవ్, వెల : 99/-, పేజీలు : 82
ప్రతులకు : తెలంగాణ రిసోర్స్ సెంటర్, చంద్రం, 490, వీధి నెం 11, హిమాయత్ నగర్, హైదరాబాద్29, 9030626288

'నా తెలంగాణ నేల గ్రహణం వీడిన వేళ' చిన్న పుస్తకమైనా మంచి సందేశమిచ్చింది. పంజరం లోంచి విముక్తి పొందిన రామచిలక తీరుగా తెలంగాణ కొత్త రాష్ట్రం ఏర్పడిన వైనాన్ని అర్థవంతంగా రచయిత్రి ఎంతో ప్రతిభా వంతంగా కవితలు రాశారు. తెలంగాణ తొలి, మలి విడత ఉద్యమాలు, పోరాటాలను, తల్లుల గర్భశోకాన్ని అక్షరాలతో శిల్పంలా చెక్కారు. అరవై ఏళ్ల తెలంగాణ ప్రజల మనోవేదనను, చెప్పలేని ఆవేశాన్ని, బాధలు, కష్టాలను రచయిత్రి కళ్లకు కట్టినట్లు కవితలు రాశారు. మార్పు కోరుతున్నాను అంటూ మొదలెట్టిన తొలి కవిత బ్రిటీష్ ప్రభుత్వ పాలనపై సాగించిన ప్రజల పోరాట స్ఫూర్తిని అక్షరీకరించారు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమాన్ని నాటి బ్రిటీష్ ప్రభుత్వ పాలనతో పోల్చారు. నా తెలంగాణ నేల గ్రహణం వీడే వేళా అన్న కవిత తెలంగాణ ప్రకటన వెలువడుతున్న సమయంలో ప్రజల్లో మెదిలిన ఆలోచనలకు రూపమిచ్చారు. ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్న వేళా పాలకులు, ఆంధ్ర ప్రాంతానికి చెందిన నాయకులు సృష్టించిన రాయలతెలంగాణ, కేంద్ర పాలిత ప్రాంతం, తెలంగాణకు బ్రేక్ వంటి కథలు, కథనాల వెనుకున్న ఉద్దేశాన్ని చక్కగా వివరించారు. గుర్తుకొస్తే దు:ఖమొస్తది అనే కవిత పేగు బంధాన్ని పొగొట్టుకున్న తల్లులు...తన బిడ్డను ఊహించుకుని ఎంత దు:ఖీస్తారో, ఎంత మానసిక వేదనను అనుభవిస్తారో చెప్పి పాఠకుల హృదయాలను బరువెక్కించారు. ఏర్పడిన తెలంగాణ ప్రజల భవిష్యత్తు ఎలా ఉండాలో, ప్రజల యోగక్షేమాలు ఎలా ఉండాలోఅంకురంలో రాశారు. తెలంగాణ ఏర్పడిన తొలి క్షణాల్లో తన మనసులో కలిగిన భావాలను వ్యక్తపరిచిన విధానం చక్కగా ఉంది.

- రఘు గుడిగ

లఘుచిత్రాలు ప్రత్యామ్నాయం కాగలవా?

బంగారు తెలంగాణలో చలనచిత్రం, రచన: వారాల ఆనంద్,
పేజీలు: 68, వెల: రూ. 60. ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

ఒక సాంస్కృతిక విధానం లేకుండా మంచి సినిమాలు రావడం సాధ్యం కాదు. మరీ ముఖ్యంగా తెలంగాణలో అలాంటి అవకాశమే లేదు. ఈ విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పారు వారాల ఆనంద్. 'బంగారు తెలంగాణలో చలనచిత్రం' అనే వారి పుస్తకంలో తెలంగాణకు ఒక సాంస్కృతిక విధానం రూపొందాల్సిన అవసరాన్ని సూచించారు. అలాగే తెలంగాణ ఫిలిం ఇనిస్టిట్యూట్, హైదరాబాద్ ఫిలిం ఆర్కైవ్స్ లాంటి సంస్థల్ని ఏర్పాటు చేయాలన్న వారి సూచనలు ఆహ్వానించదగ్గవి. కానీ తెలంగాణ రచయితలు, కవులు తెలంగాణ సినిమా నిర్మాణంలో ముఖ్యభూమికను పోషించాలని చెప్పడం విడ్డూరంగా వుంది. వీరి సృజనాత్మక కృషి, సినిమా నిర్మాణం ఒకే కోవకు చెందవు. రెండు ఆసక్తులు, అభిరుచులు, ప్రక్రియలు భిన్నమైనవి. ఓ రచయిత లేదా కవి ఎప్పుడయినా మంచి సినిమా చూసి ఓ కవిత లేదా వ్యాసం రాయొచ్చు. అంతమాత్రాన వారు సినిమా నిర్మించలేరు. కనుక సినిమా రంగం మీద ఆసక్తి వున్న తెలంగాణ వారు తప్ప కవులు, రచయితలు వచ్చి చేయగలిగిందేమి లేదు.

ఇక తెలుగు సినిమా రంగంపై ఆంధ్ర సంపన్నుల పట్టు గురించి రాసిన వ్యాసాలు సహేతుకంగా వున్నాయి. లఘుచిత్రాలు ఉద్యమంగా రావాలన్న సూచనతోనూ పేచీలేదు. అయితే అవి మెయిన్‌స్ట్రీమ్ సినిమాకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాబోవన్నది వాస్తవం. వేటి అస్తిత్వం వాటిదే. కమర్షియల్ సినిమాకు లఘుచిత్రాలు ప్రత్యామ్నాయం కాజాలవు. ఈవిధంగా సినిమా రంగానికి సంబంధించిన పదహారు వ్యాసాలు పుస్తకంలో వున్నాయి. వీటిని చదివితే రచయితకు సినిమా రంగం పట్ల వున్న ఆసక్తి, అనుబంధం బోధపడతాయి.

- మాడా కేశవరావు

నాకు నచ్చిన పుస్తకం

గాంధీ ఆత్మకథ సత్యశోధన



నాకు నచ్చిన పుస్తకం మన జాతిపిత మహాత్మాగాంధీ ఆత్మకథ 'సత్యశోధన'. ఈ పుస్తకాన్ని నేను డిగ్రీ చదువుతున్నప్పుడు 20 రూపాయలు పెట్టి కొన్నాను. ఈ ఆత్మ కథ చదువుతున్నంతసేపు ఓ ప్రముఖ వ్యక్తి పుస్తకాన్ని చదువుతున్నట్లు కాక గాంధీ తన జీవితాన్ని మనతో పక్కనే ఉండి ముచ్చటిస్తున్నట్లుగా ఉంటుంది. ఆయన ఆత్మకథ చదివితే మనలో మలిన గుణాలను నిర్మూలించే విధంగా ఉంటుంది.

ఈ పుస్తకంలో ముఖ్యంగా గాంధీ అంటరాని వ్యక్తులపై చూపిన వారు హరిజనులు అని నామకరణం చేయడం, ఇంగ్లండు వెళ్లి బారిస్టరు చదువుతానంటే వైశ్యకుల పెద్దలు కుల బహిష్కరణ చేస్తానన్నా, తాను పై చదువులు చదువుతాననే మొండి ధైర్యం, తల్లికి సీమలో (పరాయి దేశంలో) ఎలాంటి పరిస్థితి ఎదురైనా మద్యం, మాంసం, స్త్రీను ముట్టుకోనని మూడు ప్రమాణాలు చేయడం.

సిగరెట్లలోన మజా కోసం నౌకర్ల డబ్బులను గాంధీ బాల్యంలో దొంగిలించడం, ఆ తర్వాత పశ్చాత్తాప పడడం ఇలాంటి సంఘటనలన్నీ ఆకట్టుకున్నాయి. అహింస, సత్యాగ్రహం కూడా గాంధీ ద్వారానే లోకానికి పరిచయమయ్యాయి. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో తెలిసో, తెలియకో పొరపాట్లు, తప్పులు చేస్తుంటారు. ఇలాంటివి మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే గాంధీ ఆత్మకథ అందరూ చదవాలి.

- జానపాటి శ్రీనివాస్,
మిర్యాలగూడ, నల్గొండ.

■ ఈ వారం కవిత్వం

మోర్ చెల్‌కట్ట

- ఆశారాజు

పత్తర్ గట్టీలో ఫకీరు కలిశాడు
నెమలి పింఛాల కట్టతో
ముఖాన్ని తుడిచాడు
ఊదు పొగ వేసి
నన్ను పరిమళభరితం చేశాడు
భుజం మీద చేయి వేసి
ప్రేమను బోధించాడు

నువ్వు ఎప్పుడు చూసినా
నవ్వుతూ వుంటావు–
ఎంత బాధను దాచుకొంటున్నావు బేటా–
కనిపించిన వాళ్లందర్నీ పలకరిస్తావు–
ఎన్ని గాయాల్ని ఓర్చుకొంటున్నావు మియా!
ఎప్పుడూ కాలినడకనే వెళుతుంటావు–
ఉన్నదంతా ఎప్పుడు దానం చేశావు బిడ్డా!
నీకు చాలా విషయాలు చెప్పాలనుకొన్నాను
కాని, నీ కళ్లే నాకు
చరిత్రను చూపిస్తున్నాయి

ప్యాలెస్ టాకీస్‌లో కలిసిన
అపరిచితురాలి నవ్వును మరిచిపోకు!
చార్మినార్ నీడలో జంటగా కూర్చున్న
ఎండాకాలం దాహం రుచిని గుర్తుంచుకో!
ఉదయాన్నే ఇరానీ హోటల్లో దొరికిన
పాటని
దినం గడిచేదాకా తీయగా పాడుకో!
ఒంటరిగా సినిమాలో ఏడ్చిన
మ్యాట్నీ షో సందర్భాన్ని
పాతడైరీలో రాసి పెట్టుకో!
కిటికీలో ఎగిరే కురులను చూసి
రాయి తగిలి పడిపోయిన మూలకు
అప్పుడప్పుడూ వెళ్లి
దండం పెట్టుకో!

నుమాయిష్ రోజుల్లో
కానుకగా యిచ్చిన
'ఇస్తంబుల్' డాన్సర్ 'తమారా' ఫొటోను
నిర్లక్ష్యంగా పారేయకు!
నీవు అమితంగా ఇష్టపడిన
సౌందర్యవతులందరూ –
నీవు తిరిగిన నగరానికి
కొత్త శోభనిచ్చారు
వాళ్ల జ్ఞాపకాలతో దారి పొడుగునా
వేల దీపాలు వెలిగించు!

హైదరాబాద్
నీకు పూర్వులిచ్చిన

పురాతన చిత్రశాల
అక్కడెక్కడో కాకుండా
అన్ని మూలల్లో నీవే కనిపించాలి
గల్లిగల్లీలో నీ కవిత్వం
సితారు తీగల్లా ధ్వనించాలి
లేదా ! షాలిబండా మీద
పరదా పక్కకు జరిగిన
నెలవంకను మోసే
రిక్షానన్నా ఎదురుపడాలి

ఎక్కువసేపు చూస్తే –
నీవూ హైదరాబాదు కౌగిలించుకొని
కనువిందు చేయాలి

ఇంటికి వెళ్లు బేటా!
మీ అమ్మ ఎదురు చూస్తోంది
కర్ఫ్యూలో నీకు ఆశ్రయమిచ్చిన
నిమ్మపండు లాంటి ముద్దముఖం
తలుపులు తెరిచే వుంచింది.

ఎన్ని ఎదురుదెబ్బలు తింటూ
ఈ నగరం నగిషీలు కాపాడుతున్నావో!
కలవరపెట్టే కష్టాల్నైనా
సుఖాల్నైనా మరిచిపోకు!
నీవు ఎప్పుడూ బతికే వుంటావు!

ఉల్లాసంగా నేను చెప్పేది వింటున్నావంటే
–
ఎంత సేపట్నించి నిప్పులు
మింగుతున్నావో!
…
మనసు మళ్లీ దేన్నో జ్ఞాపకం చేసుకొంది
కొత్త గాయమేదో మురిపిస్తూ
బయటపడింది
…
కళ్లు తుడుచుకునే లోపల
ఫకీరు కనిపించలేదు
ఎన్నిసార్లో ఇన్ని రుతువులు మారాయి
నన్ను తాకిన నెమలీక సొగసు
ఇప్పటికీ రాలి పోలేదు
(ఫకీర్ల దగ్గర వుండే నెమలీకల కట్టను
'మోర్ చెల్‌కట్ట' అంటారు)

రచయిత సెల్ : 93923 02245

టీవీలో, సినిమాల్లో కనిపించే కార్టూన్ కేరెక్టర్ల షోలు చూసే ఉంటారు కదూ! ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలన్నీ ఆ కార్టూన్లవే. ఈ బొమ్మలన్నిటినీ క్రేయాన్ పెన్సిళ్లతో తయారు చేశాడు హాంగ్ ట్రాన్. ఇతనికి ఇలా కార్టూన్ బొమ్మలు తయారు చేయడం సరదా. అలా **36** కేరెక్టర్లను పెన్సిళ్లమీద మలిచాడు హాంగ్. మామూలుగానే చిన్నారులు రంగు పెన్సిళ్లు కనిపిస్తే చాలు... ఎక్కడ బొమ్మ కనిపిస్తే అక్కడ రంగులు పులిమేస్తారు. ఇక ఈ కార్టూన్ కేరెక్టర్ల క్రేయాన్ పెన్సిళ్లను చూస్తే ఊరికే కూర్చుంటారా చెప్పండి...!

పిల్లల పుస్తకాల అంచుల మీద చూడండి...! చక్కగా వారి పేరో, ఆ పుస్తకం పేరో స్కెచ్ పెన్నుతో అందంగా రాసేసుకుంటారు. అలా పేర్లు కాకుండా బొమ్మలు వేస్తే ఎలా ఉంటుంది? బ్రహ్మాండం కదూ! అలల్లా కదిలే కాగితపు అంచులను పట్టుకుని చిత్రాలను వేయడం అంత తేలిక కాదు, కానీ ఇక్కడ కనిపిస్తున్న చిత్రాలన్నీ అవే. ఈ చిత్ర కళ ఇప్పటిది కాదు, 14వ శతాబ్దంలోనే మొదలైంది. అయితే పూర్తి రూపాన్ని సంతరించుకుంది మాత్రం 17వ శతాబ్దంలో. ఈ చిత్ర కళని ఫోర్ ఎడ్జ్ పెయింటింగ్ అంటారు. ఈ చిత్రాలు అప్పటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తాయి.